శ్రీ

గెడం రంగారావు

తేనె పూసిన కత్తులు

సుజనశ్రీ

జలజ విసుగ్గా చేతిలోని ఫ్లాస్క్ ని బల్లమీదకు గిరాటు వేసింది. ఆమెకు నిన్నటినుంచి ఒకటే చికాకుగా ఉంది.

నిన్న ఉదయం తానుంటున్న ఇంటికి ఎదురింట్లోని నరసింహులు తనని చూసి వెకిలిగా నవ్వుతాడా? వాడికేం పొయ్యేకాలం? అసలు వాడికి పెళ్లాం, ముగ్గురు ఆడపిల్లలూ ఉన్నారు, ఈసడించుకుంది.

జలజ ఏదో దినపత్రిక ఆఫీసులో స్టెనోగా పనిచేస్తున్నది. ఆమె అప్పుడప్పుడు కొన్ని వ్యాసాలు కూడ రాస్తుంటుంది, అదే పత్రికలో. ఆమెకు ఇంకా వివాహం కాలేదు.

ముందూ వెనుక తల్లీ దండ్రీ ఎవరూ లేరు. ఒక్క ముసలి అమ్మమ్మ తప్ప. ఆమే, తనూ ఈ ఇంట్లో చాలకాలం నుంచీ అద్దెకుంటున్నారు. అమ్మమ్మ మూడు రోజుల క్రితమే ఊరికి వెళ్ళింది, తెలిసినవాళ్ళ పెళ్ళికి వెళ్ళి రావాలని.

తను ఒంటరిగా ఉన్నానని పసిగట్టి ఆ నరసింహులు ఇంతకు తెగిస్తాడా? ఇది వాడి భార్యకు చెబితే! ఆవిడో మహంకాళి లాంటిది. మొగుడ్ని నాలుగు మొట్టి మూల కూర్చోబెట్టినా పెట్టగలదు.

ఆ రోజు చికాకుగానే ఆఫీసుకు వెళ్ళింది. తన పక్క సీటులోని రామారావ్ కూడ, ఎందుకో, ఆనాడు తనని "టీజ్" చేస్తున్నట్టుగా అనిపించింది.

ఆ రిపోర్టు చూపించండి, ఈ రిపోర్టు ఎలా రాస్తున్నారు అని ఏదో సాకుతో తనవద్దకు వస్తున్నాడు. రిపోర్టు కాగితాలు ఇచ్చేటప్పుడూ, తీసుకునేటప్పుడూ అతని వ్రేళ్ళను తన చేతివ్రేళ్ళకు తాకిస్తున్నాడు కావాలనే. జలజకు కోపం వచ్చేసింది. రామారావు గూబమీద చెంప దెబ్బ కొడదామనిపించింది ఆమెకు.

అయినా తమాయించుకుంది. తను స్త్రీ, అతడు మగవాడు. ముల్లువచ్చి ఆకుమీద పడినా, ఆకువచ్చి ముల్లుమీద పడినా ఆకుకే ప్రమాదం. అందుకే తనను తాను శాంతపరచుకుంది.

గాంధీగారిమీద వ్యాసం తయారుచేయవలసి ఉంది. ఇంటిదగ్గర రాసుకుని వస్తానని ఎడిటర్‌తో చెప్పి, ఆఫీసు నుంచి వచ్చేసింది. అయితే ఆమెకు ఇంటికి పోబుద్ధి కాలేదు.

నేరుగా తన స్నేహితురాలు రాగిణి ఇంటికి వెళ్ళింది. రాగిణికూడ ఏదో ప్రైవేటు కంపెనీలో స్టెనోగా పనిచేస్తు

న్నది. ఆమె ఒక్కతే ఉంటున్నది ఆ పోర్షన్‌లో. మిగతా భాగాల్లో వేరే కాపురాలు నివసిస్తున్నయ్. ఆమెకు తన అవస్థ చెప్పుకుంది జలజ.

“మా గ్రాండ్ మదర్ వచ్చేటప్పటికి ఇంకో నాలుగైదు రోజులు పట్టవచ్చు. అందాక నేనుగూడ నీతోబాటే ఉంటాను రాగిణీ!”

“నిరభ్యంతరంగా ఉండు. అయితే నేనీపూట క్యాంప్‌కు వెళుతున్నాను జనరల్ మేనేజర్ వెంట. ఇక్కడా నీవు ఒంటరిగానే ఉండాల్సి వస్తుందేమో! కాకపోతే నీకిక్కడ నరసింహులులాంటి రావణాసురుళ్ళు ఉండరులే!” రాగిణి హామీ ఇచ్చింది.

“అయితే ఇంకేం! మహారాణీలాగా ఉంటాను.”

రాగిణి తన బ్రీఫ్‌కేస్ తీసుకుని వెళ్ళిపోయింది కంపెనీ కారు రాంగానే.

ఇంట్లో జలజ మిగిలిపోయింది. వ్యాసం రాద్దామని కాగితాలూ, కలం, ప్యాడ్ తీసుకుంది. ఎంతసేపటికీ ఆమె కళ్ళల్లో నరసింహులూ, రామారావే మెదలడంతో ఆమెకు “మూడ్” కుదరలేదు.

విసుగా కాగితాల్ని టేబుల్ మీద పారేసింది. టాయిలెట్‌లోకి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది. ఫ్లాస్కు వంచుకుని కాఫీ త్రాగింది.

ఆ తర్వాత ఆమె ఇంటిని సోదా చేయసాగింది. ఆ పోర్షన్‌లో రెండు గదులు, బాత్‌రూమ్ ఉన్నయ్. మొదటి గది డ్రాయింగ్ రూమ్, రెండో గది వంటగది క్రింద వాడుకుంటోంది రాగిణి.

ఆ పోర్షన్ మూడో అంతస్తులో ఉంది. ఇంతటి మహా నగరంలో, ఇళ్ళు దొరకటం చాలా కష్టం. ఈ బిల్డింగ్‌లో దాదాపు యాభై అరవై కాపురాలుంటున్నయ్.

6

మొదటి అంతస్తువరకు వ్యాపార సంస్థలు ఉన్నయ్. మూడో అంతస్తులోనూ, నాలుగో అంతస్తులోనూ కాపురాలుంటున్నయ్.

రాగిణి షోరూమ్ ముందు వాటాలోదే. కిటికీ దగ్గర కూర్చుంటే రోడ్డుమీది జనం కనబడుతూనే ఉంటారు.

ఆమె షోరూమ్ ఎదురుగానే, రోడ్డుకు అటు ప్రక్కగా మరో మూడంతస్తుల బిల్డింగ్ ఉన్నది. అందులో ఎక్కువగా సినిమా డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు ఉన్నయ్. మూడో అంతస్తులో మటుకు మూర్తి ఫోటో స్టుడియో ఉంది. అతనికి పెద్దగా బిజినెస్ జరుగుతుందో లేదో అనుకుంది జలజ.

ఫోటో స్టుడియో క్రింద షోరూమ్‌లో ఉంటే ఎవరన్నా ఫోటో తీయించుకునే వాళ్ళు త్వరగా రావటానికి వీలవుతుంది. మూడో అంతస్తులోని ఫోటో స్టుడియోకి ఎవరొస్తారు అంత ఓపిక చేసుకుని!

వెనక్కు వచ్చి కుర్చీలో కూర్చుంది జలజ. కిటికీలోంచి మూర్తి స్టుడియో కనుపిస్తున్నది. ఏదో ఆలోచనగా స్టుడియో కేసి చూసింది.

కిటికీలోంచి చూస్తున్న జలజకు స్టుడియో తలుపు తెరుచుకుని ఎవరో వచ్చినట్లుగా అనిపించింది. మూర్తి డెవలపింగ్ స్టాండు దగ్గర నిలబడి ఏదో ఫోటోని "టచ్" చేస్తున్నాడు.

తెరుచుకున్న వాకిలిగుండా వెలుతురు లోపల పడుతున్నది. హ్యాట్ పెట్టుకున్న వ్యక్తి లోపలకు వచ్చినట్లుగా వెలుతురుమీద నీడ పడింది. అయితే ఆ వ్యక్తి జలజకు కనుపించలేదు. కేవలం వెలుతురుగా ఉన్నచోట ఒక వ్యక్తి నీడ పడడంవల్ల ఆమె అలా ఊహించుకుంది.

అయిదు నిముషాలు గడిచినయ్. మూర్తి దేన్నో

చూడటానికి కాబోలు కిటికీ వద్దకు వచ్చి క్రిందకు చూశాడు. ఆ తర్వాత అతను ఇంకా వంగి క్రిందకు చూచాడు.

అతడి వెనుకే ఆ ఆకారం కదిలినట్టుగా లీలగా కనుపించింది జలజకు.

మరుక్షణంలో అతను పెద్దగా అరుస్తూ కిటికీలోంచి క్రింద పడిపోతున్నాడు మూడో అంతస్తులోంచి. సెకండ్లలో అతను క్రింద పడడం, తల పగిలిపోవటం జరిగింది.

జలజ గాభరాగా కిటికీవద్దకు వెళ్ళి రోడ్డువంక చూడాలని వంగి చూస్తూ మూర్తి స్టడీరూంలోకి చూసింది. ఇందాకటివరకు తెరిచివున్న తలుపు మూసేసి ఉన్నట్టున్నారు, ఇందాక తను చూసిన వెలుగు, బయటినుంచి లోపలకు పడుతున్న వెలుగులేదు. ఎవరో తలుపు మూసేసి వెళ్ళిపోయి ఉండాలి అనుకుంది.

మూర్తి శరీరం చుట్టూ జనం చేరారు. అంబులెన్స్ వచ్చింది. అప్పటికే అతడి ప్రాణం పోయింది.

పోలీసులు వచ్చారు. ఆ చుట్టుపట్ల ఉన్నవారినుంచి వివరాలు సేకరించారు సాక్ష్యం క్రింద.

మూర్తి కిటికీలోంచి క్రిందకు చూస్తూ బ్యాలెన్స్ తప్పిపోయి కిటికీలోంచి జారి క్రింద పడిపోయాడని అందరూ చెప్పిన కథనం.

జలజకు మాత్రం ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన కాదనీ, కావాలని ఎవరో మూర్తిని హత్యచేసి ఉండాలని పించింది.

పోలీసులకు అదే చెప్పింది.

"నేను కిటికీలోంచి చూస్తూ కూర్చున్నాను. మూర్తి ఉన్న గది తలుపు తెరిచి ఉన్నదనటానికి ఆధారం బయట నుంచి సూర్యరశ్మి ఆ వాకిట్లోంచే లోపలకు పడుతున్నది.

అంతలో ఏదో నీడ పడింది. అంటే మరో వ్యక్తి లోపలకు వచ్చాడన్న మాటే గదా! అతడు మూర్తితో ఏమో చెప్పి ఉండాలి. మూర్తి ఆత్రంగా కిటికీవద్దకు వచ్చి చూశాడు. వెనుకనున్న వ్యక్తి అతడ్ని క్రిందకు తోసేశాడేమో అని నా అభిప్రాయం."

"మూర్తి క్రిందపడేటప్పుడు అతని వెనుకనున్న వ్యక్తి ఎవరైనా కనుపించారా?" సార్జెంట్ అడిగాడు.

"లేదండీ! ఎవరూ కనుపించలేదు. అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది" అని చెప్పింది.

2

మిసెస్ మూర్తి. సరస్వతి తన పుట్టింటికి వెళ్ళింది ఈ సంఘటన జరగక ముందు. ఆమెకుగూడ కబురు వెళ్ళింది.

మూర్తి మరణం కేవలం ప్రమాదవశాత్తు జరిగిందనీ, ఇది హత్యకాని, ఆత్మహత్యకాని అయేందుకు అవకాశం లేదని పోలీసుల కథనం.

మూర్తికి నలభైయేళ్ళుంటాయి. ఆతని మొదటిభార్య ఎవరితోనో లేచిపోయింది. సరస్వతి గూడ అప్పటికి భర్తను కోల్పోయిన విధవ. అయితేనేం? ఆమెకు లక్షరూపాయల ఆస్తి వుంది. అందుకే మూర్తి సరస్వతిని వివాహమాడాడు.

వారిద్దరి వివాహ జీవితంలో ఎటువంటి పొరపొచ్చాలు, విభేదాలు లేవు. సరస్వతికి మూర్తిని హత్యచేసే టంతటి అవసరంలేదు. మూర్తికి గూడ ఆర్థికంగా ఇబ్బందిలేదు. కాబట్టి అతడు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరంలేదు. పోలీసుల వాకబులో తెలిసినదేమంటే మూర్తి ఆ ఉదయమే పొరుగూరుకు వెళ్ళి వచ్చాడు. ఏ ఊరికి వెళ్ళిందీ ఎవరూ చెప్పలేకపోయారు.

మూర్తి శరీరాన్ని మార్చురీలో శవపరీక్ష చేసి అతడు

విష ప్రయోగంవల్ల కాని, బలవంతంగా కొట్టి, హింసించి గాని చంపబడలేదని నిర్ధారణ చేశారు. అసలు అదైనా జరగకుండానే పోలీసులు శవాన్ని వదిలేసేవాళ్ళే. జలజ వాఙ్మూలం మూలంగా వాళ్ళు ఆ పని చెయ్యక తప్పలేదు.

మూర్తి ఇల్లూ, స్టుడియో అన్నీ అదే పోర్షన్లో ఉన్నయ్. ముందు రెండుగదులూ స్టుడియో క్రింద, వెనుక కుడిప్రక్కన ఉన్న అయిదు గదులూ నివాసం క్రిందా ఉన్నయ్. అతడు ప్రమాదానికి గురి అయినరోజున అతడి భార్యకూడ ఇంట్లోలేదు.

అయితే అతడు చనిపోయిన రోజు రాత్రి ఆ ఇంట్లో మరో విశేషం జరిగింది.

ఆ రాత్రి అతని ఇంట్లోకి ఎవరో దొంగ జొరబడ్డాడు. ఇంటికి వెనుక ప్రక్కగా ఊచలులేని కిటికీ ఉంది. దాని తలుపులు తెరుచుకునిమరీ ఆ వ్యక్తి లోపలకు జొరబడ్డాడు. మూర్తి భార్య సరస్వతి మరో పనిమనిషిని కాపలాకోసం, తోడుకోసం అట్టేపెట్టుకుంది. వాళ్ళిద్దరూ బెడ్ రూమ్లో నిద్రపోతున్నారు.

రాత్రి 11 గం. లయి వుంటుంది. ఆ వ్యక్తి లోపలకు రావటం ఎవరూ చూడలేదు. లోపల గదుల్లో అలికిడి అయితే పనిమనిషే ముందు కళ్ళు తెరిచింది. సరస్వతిని లేపి యిద్దరూ అలికిడి వినపడిన గదిలోకి వెళ్ళారు. ఎవరో వ్యక్తి వాళ్ళను చూస్తూనే కిటికీలోంచి దూకి క్రిందకు వెళ్ళిపోయాడు.

దీన్ని పోలీసులు దొంగతనం క్రిందే జమకట్టారు. ఇల్లు తాళంవేసి ఉండటంచూసి ఏ దొంగ అయినా, ఆ ఇంట్లో ఎవరూ ఉండరని ఊహించి ఇంట్లోకి జొరబడి ఉంటాడని వాళ్ళు అనుమానించారు.

మర్నాటినుంచి ఇద్దరు పోలీసుల్ని ఆ ఇంటివద్ద కాప

లాగా వేశారు. దాంతో మరో కొంత ఎవరూ ఆ ఇంట్లోకి దూరే అవకాశం కలగలేదు.

జలజ ఆ ప్రమాదాన్ని మరచిపోవాలని ఎంతగానో ప్రయత్నించినకొద్దీ ఆమె మనసులో అదే దృశ్యం మరీ మరీ మెదుల్తోంది.

జలజకు సినిమా కెళ్ళినా, ఆఫీసులో ఉన్నా, లేదా మరో చోటికి వెళ్ళినా అతని మరణదృశ్యం ఆమెకళ్ళల్లో మెదులుతూనే ఉన్నది. తను పొరబాటు పడిందా? తెరచి వున్న వాకిలిలోంచి వెలుతురు పడుతూండగా, ఆ వెలుగుకు అంతరాయం కలిగిస్తూ నీడపడటం తను స్పష్టంగా చూసింది. వెలుగూ నీడల్ని ఒకదాని కొకటిగా భ్రమించి పొరబడే స్థితిలో లేదు తను. అయితే మరి హంతకుడెవరు?

చనిపోయిన ఫోటోగ్రాఫర్ మూర్తి ఆమె కలల్లోకి గూడ రాసాగాడు. కనీసం అతగాడి పుట్టుపూర్వోత్తరాలు తనకు తెలిసివున్నా అతని మరణాన్ని తను విడమర్చగలిగి ఉండేది. ఆమె చిక్కు ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికేదాకా అది అభేద్యమైన మిస్టరీగానే ఉండిపోయింది.

మరునాటి ఉదయం పేపర్లో ప్రకటన చూసి జలజ అయోమయంలో పడిపోయింది. ఆ ప్రకటన సరస్వతి వేయించింది.

తన భర్త మూర్తి పెద్ద కళాకారుడనీ, అతని ఆత్మకథను వ్రాయించి అచ్చు వేయిస్తుందట. ఆ పనికై జర్నలిజంలో అనుభవం కలిగిన స్త్రీ కాంట్రాక్టు పద్ధతిపై కావాలని ఉంది. సరస్వతి ధనవంతురాలు. కీర్తిశేషుడైన తన భర్త పేరు ప్రక్కనే తన పేరుగూడ అచ్చులో చూసుకోవాలని ఆమెకు మోజేమో.

జలజకు అంతలోనే మెరుపులా ఆలోచన వచ్చింది.

అయితే సరస్వతి తన భర్తయొక్క ఆత్మకథను తయారు చేయించబోతోంది. ఆత్మకథ రాయాలంటే ఆ వ్యక్తిని గురించి అన్ని విషయాలు తెలియాలి. మూర్తి జీవితంలోని నిగూఢ రహస్యాలు తెలుసుకోవాలంటే ఇదే మంచి అవకాశం. ఏమైనాసరే తనుకూడ ఈ పనికి దరఖాస్తు పంపించాలని అనుకుంది.

3

మూర్తి ఫొటోస్టుడియో మెట్లు ఎక్కుతూ అన్ని దిక్కులా పరీక్షిస్తున్నది జలజ.

వాకిట్లో పనిమనిషి ఎదురయింది.

"సరస్వతిగారున్నారా?" జలజ అడిగింది.

"పేపర్లో ప్రకటన చూసి వచ్చారా?"

"అవును!"

"లోపలకు వచ్చి కూర్చోండి. ఆమె ఎవరితోనో మాట్లాడుతున్నారు" అంటూ డ్రాయింగ్ రూమ్‌లో కుర్చీలు చూపించింది.

జలజ ఆ రూమ్‌ని కలయజూసింది. నేలమీద ఎర్ర రంగు తివాసీ పరిచివుంది. సోఫాసెట్లు, రోజ్ వుడ్‌తో చేయబడి పూలూ, లతలు చెక్కబడిన కుర్చీలూ, టేబులూ, ప్రతి గోడమీద పెద్ద పెద్ద ఫొటోలు, స్టూలుమీద పెద్ద పులి బొమ్మ. మొత్తానికి కళాభిరుచులతో అలంకరింపబడి ఉంది ఆగది.

ఎవరిదో మాసిపోయిన ఈవెనింగ్ హ్యాట్ పులితల మీద తగిలించబడి ఉంది. ఆ గదిలోని ప్రతి అందమయిన వస్తువునూ వెక్కిరిస్తున్నట్టుగా ఉంది ఆ హ్యాట్. అంత అందవికారంగా ఉంది.

లోపల గదిలోంచి మాటలు అస్పష్టంగా వినిపిస్తు

న్నయ్. గోడగడియారం టిక్ టిక్ మనే శబ్దం. క్రింద రోడ్డుమీద కార్లూ, వాహనాలూ పోతూన్న ధ్వని వినబడుతున్నయ్ పెద్దగా.

పనిమనిషి మరో ఇద్దరు వ్యక్తుల్ని ప్రవేశపెట్టింది. అందులో ఒకామె సన్నగావుంది. లోతైన కళ్ళు, లోపలకు పోయిన దవడలూ, కొంత నలుపూ, కొంత తెల్లగా ఉన్న జుట్టూ, చేతిలో చిన్న ప్లాస్టిక్ బ్యాగ్ పట్టుకుని ఉన్నది.

ఈమెను ఎక్కడో చూసినట్టున్నదే అనుకుంది జలజ. రెండో వ్యక్తి పురుషుడు. అయిదున్నరడుగు లున్నాడు. ఎర్రగా అందంగా ఉన్నాడు. టెరిలిన్ ప్యాంటూ, ఫుల్ బూట్, పొడుగు చేతుల చొక్కా టక్ చేసుకుని హుందాగా ఉన్నాడు.

సరస్వతి కూర్చున్న గదితలుపు తెరుచుకుంది. సన్నగా పీలగా ఉన్న వ్యక్తి హడావిడిగా బయటకు దూకాడు ఆ గదిలోంచి. పులిబొమ్మమీద తగిలించబడివున్న హ్యాట్ ని అందుకున్నాడు.

"మళ్ళీ నాకు ఏ విషయం ఎప్పుడు తెలియజేస్తానంటారు మాడమ్!" కంగారుగా ఆమెవేపు తిరిగి అడిగాడు.

"రేపు మీకు పోస్టులో తెలియజేస్తాం!" లోపల్నుంచి అధికారగర్వం ఉట్టిపడేలా కంఠం వినిపించింది.

అతడి కళ్ళల్లో కనుపించే ఆదుర్దానుబట్టి అతడికీ కాంట్రాక్టు రాలేదేమో అనిపిస్తున్నది.

లోపల్నుంచి పనిమనిషి వచ్చింది. "అమ్మగారు పిలుస్తున్నారు వెళ్ళండి!" జలజ వంక చూస్తూ అన్నది.

జలజ కంగారుగా తననుతాను సర్దుకుని గదిలోకి వెళ్ళింది. సరస్వతి పేరుగల వ్యక్తికి అంతే పెద్దగా చదువు

అబ్బలేదనిపించింది. కాకపోతే ఆమెకు తనకు ఐశ్వర్యం ఉన్నదనే గర్వం మాత్రం మనిషిని మించిపోయి వున్నది.

జలజ తను పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్టు, ఈ గ్రంథం వ్రాసిపెట్టినందుకు పారితోషికం రెండువేలు కావాలని చెప్పింది.

సరస్వతి ఇంకా కొన్ని వివరాలడిగింది. "మీరు కాసేపు వెయిట్ చెయ్యండి. మిగతా వాళ్ళని గూడ ఇంటర్వ్యూ చేసి, ఏ సంగతీ మీకు ఇప్పుడే చెప్పేస్తాను."

"థ్యాంక్యూ మాడమ్!" అంటూ జలజ బయటకు వచ్చింది. డ్రాయింగ్ రూమ్‌లో ఈతడన కూర్చోలేదు ఆమె. గోడలమీదున్న చిత్రాలన్నింటినీ నిశితంగా తరచి తరచి చూడసాగింది. మూర్తి లైఫ్-సైజ్ ఫొటోగూడ ఉంది. అందులో అతని కళ్ళల్లో చిలిపితనం గోచరిస్తున్నది.

ఫొటోవంక చూస్తూ ఆమె ప్రక్కకు మరో అడుగు వేసింది. అయితే అక్కడ కుర్చీలాంటిదేదో అడ్డంవుండి ఆమె తూలి పడబోయింది. ఎవరిదో హస్తం ఆమెను ఆపింది.

జలజ ఆ వ్యక్తివంక చూసింది. అతడు ఒక క్షణం క్రితం సరస్వతి గదిలోకి వెళ్ళివచ్చిన, మాసిపోయిన హ్యాట్ యజమాని.

అతగాడు కుర్చీలో కూర్చుని తన ముందున్న డ్రాయర్లోని కాగితాల్ని వెదకి చూస్తున్నాడు. ఇంటర్వ్యూకని వచ్చిన వ్యక్తికి డ్రాయరులోని కాగితాలు వెదకవలసిన పని ఏముంటుంది? ఇతడు నిజంగా ఉద్యోగంకోసం వచ్చాడా? లేక గూఢచారిపని చేస్తున్నాడా?

అతడు తన హ్యాట్ ఎత్తి "గుడ్ మార్నింగ్ మాడమ్!" అన్నాడు.

జలజ మెదడులో అతడి హ్యాట్ దేన్నో గుర్తుకు

తెచ్చింది. మూర్తి గదిలో నీడ పడినప్పుడు సరిగా ఇలాంటి హ్యాట్ నీడే పడింది.

"మీరు...మీరు మూర్తికి ప్రమాదం జరిగినప్పుడు రోడ్డుమీద జనంలో కనిపించారు కదూ?" తొట్రుపాటుతో జలజ అడిగింది.

ఆ వ్యక్తి ఇంకా కంగారు పడ్డాడు. "మూర్తి ఎప్పుడు పోయాడో నాకు తెలియదు. కాని నేను ఆ రోడ్డుమీదే తిరుగుతుంటాను ఎక్కువగా. ఎందుకంటే నేనూ ఈ వీధి చివరలోనే ఉండేది" అతడు చిరునవ్వుతో అన్నాడు. అంతలోనే అతడు మళ్లీ కంగారుగా కనుపించాడు. డ్రాయరు లోపలకు తోసేశాడు. జలజ భుజంమీదుగా ఆమె వెనుకవున్న వ్యక్తిని చూస్తూ.

జలజ కూడ వెనుదిరిగి చూసింది.

సరస్వతి గదిలోంచి బయటకు వచ్చాడు ఆ అందమైన యువకుడు. జలజ మళ్లీ ఇటు తిరిగేసరికి హ్యాట్ వ్యక్తి బయటకు వెళ్ళిపోయాడు, హడావిడిగా.

జలజవంక సాదరంగా, చిఱునవ్వుతో చూస్తూ. అన్నాడు. "ఈ జాబ్ మనిద్దరిలో ఒకరికి రావాలి. ఎందుకంటే మిగతా ఇద్దర్నీ ఆమె పంపేసింది."

"థ్యాంక్స్!" అన్నది జలజ అతడి కళ్ళల్లోకి చూస్తూ. ఇతగాడికి ఆడవాళ్ళను సమ్మోహనపరిచే శక్తి ఉంది అనుకుంది.

"మీ పేరు తెలుసుకోవచ్చా?" అతడు ప్రశ్నించాడు.

"జలజ!"

"నా పేరు కాంతారావు! అన్నట్టు ఇందాక హ్యాట్ పెట్టుకుని ఉన్న వ్యక్తి ప్రమాదం జరిగిన రోజున మీకెలా తటస్థపడ్డాడు?"

కాంతారావు చూపులు ఆమెనే నిశితంగా చూస్తు న్నయ్.

"నేను మా స్నేహితురాలొకావిడ ఇంటికి వెళ్ళి వస్తూండగా ఈ ప్రమాదం జరిగింది. నేను కాసేపు అక్కడే నిలబడిపోయాను. అక్కడే రోడ్డుమీద తచ్చాడుతూ ఈ వ్యక్తి కనుపించాడు."

"అంటే మీరు క్రిందనే రోడ్డు మీద నిలబడి ఉన్నారా?" అతను ప్రత్యేకించి మళ్ళీ అడగటం ఆమెకు చిరాకనిపించింది.

ఇక్కడకు ఇంటర్వ్యూకని వచ్చిన వ్యక్తులందరూ అనుమానితులుగానే తోచారు జలజకు. వాళ్ళందరకూ మూర్తి ఆత్మకథ రాయటంకన్న అతడి మరణంలో ఆసక్తి ఉన్నట్టుగా ఉంది. కాకపోతే ఒక వ్యక్తి స్వయంగా కాగితాలు, వ్రాయటమూ వెదకవలసిన పని ఏముంది? మరో వ్యక్తి ప్రమాద సంఘటనను గురించి ఆత్రంగా అడుగుతాడా?

తను మాత్రం, నిజంగా ఈ ఉద్యోగంకోసం వచ్చిందా? మూర్తి మరణం తాలూకు వివరాలేమైనా దొరుకుతాయేమో అని కదా వచ్చింది. జలజ తనలో తను నవ్వుకుంది.

"అవును. నేను ఆ ప్రాంతానికి వచ్చేసరికి జనం గుమిగా ఉన్నారు. హడావిడిగా పోలీసులు వచ్చారు. నేను అక్కడే ఎవరో వాకబుచేసి సంగతి తెలుసుకున్నాను! అన్నట్టు మీరూ ఆ ప్రదేశంలోనే ఉన్నారా?"

అతడు కంగారును కప్పిపెట్టుకుంటూ జవాబిచ్చాడు. "అవును. నేను పేవ్ మెంట్ మీద నడుస్తూండడం సంభవించింది."

జలజకు అనుమానం ఎక్కువైంది. ఒకవేళ ఇతడేనేమో

హంతకుడు! స్టుడియోలోకి ప్రవేశించి, మూర్తి కిటికీలోంచి చూస్తున్నప్పుడు కాళ్ళు పైకెత్తి బయటకు తోసివేశాడేమో! ఇతడు అంతపని చేయగల సమర్థుడులాగానే ఉన్నాడు.

అంతలో సరస్వతి గదిలోంచి బయటకు వచ్చింది.

“మిస్టర్ కాంతారావ్! మీకు నా భర్తగారి ఆత్మకథను వ్రాసే బాధ్యత అప్పజెప్పుతున్నాను. వెరీసారీ మిస్ జలజా! మీరుగూడ ఈ పనికి అర్హులే! కానీ మీ ఇద్దరిలో ఈ కాంతారావే ఆ పనికితగ్గ వ్యక్తిలా తోచాడు నాకు” అంది సానుభూతి ప్రకటిస్తూ.

జలజ ఉక్రోషంగా అతడి వంకే చూసింది. ముసలి ముండకు అప్పుడే సమ్మోహనాస్త్రం వేశాడల్లే ఉంది అనుకుంది కసిగా.

“థ్యాంకూ మాడమ్!” అంటూ మేడ మెట్లు చరచరా దిగి రోడ్డుమీదకు వచ్చేసింది జలజ.

వచ్చేటప్పుడున్న ఉషారు, ఆవేశం ఇప్పుడు చప్పగా చల్లారిపోయినయ్. స్టుడియోని పరీక్షించి తన ఊహా, అదే పోలీసులకు తనిచ్చిన సాక్ష్య వాఙ్మూలం ఎంతవరకు కరెక్టో తెలిసికోవాలని వచ్చింది. కాని తనకు ఆ పని సానుకూలం కాలేదు. ఎందువలన? తనకంటె అర్హతగల మరో ఇద్దరు తన పనికి ఆటంకం కలిగించారు.

చకచక నడిచిపోతున్న జలజకు వెనుకనుంచి ఎవరో పిలుస్తున్నట్టుగా తోచి ఆగింది. వెనుకకు తిరిగి చూసింది.

కాంతారావు పిలుస్తున్నాడు. అతడూ తనవెనుకే వస్తున్నట్టున్నాడు. తను తొందరలో గమనించనే లేదు.

“చూడండి జలజగారూ! మీకే ఈ అవకాశం వస్తే బాగుండుననిపించింది! కాని రాలేదు! పోనీ మీకు మూర్తి గారి జీవిత విశేషాలేమైనా కావాలంటే తర్వాత ఇవ్వ

గలను. ఎటూ అతడి జీవిత చరిత్ర అంతా నా చేతుల్లోనే ఉంటుంది గదా?"

జలజ నాకేం అక్కర్లేదులే అని అందామనుకుంది.

అంతలోనే ఆమె గోడ కావలి ప్రక్కనున్న రాగిణిని చూస్తూ "హల్లో!" అని నవ్వింది. గోడ దాటి ఆమె దగ్గరకు పోయింది.

"ఏమే రాగిణీ! నాలుగు రోజులదాకా రానన్నావే!" అంది.

"క్యాంప్ అయిపోయింది! వచ్చేశాను! అదిసరేగాని ఎవరా వ్యక్తి. చూత్తానికి మంచి అందగాడ్నే పట్టావ్!" రాగిణి ఊరిస్తూ పలికింది.

"చాల్లేవే! అతనెవరో నాకు తెలియదు. ఇంతకుముందే పరిచయం కలిగింది!"

"అలాగా! సరేలే! చేజిక్కిన మగాడ్ని కొంగున ముడేసుకుని వెళ్లాడేయ్! నేను ఆఫీసుదాకా వెళ్లొస్తాను!" అంటూ లేడీస్ సైకిల్ మీద తుర్రుమంది రాగిణి.

ఇంతసేపూ కాంతారావు కళ్ళు తననీ, రాగిణినీ కనిపెట్టి ఉండటం తను చూడలేకపోలేదు. మూర్తి స్టుడియోలోని కిటికీకి ఎదురుగా ఉన్న పోర్షన్ వంకా, రాగిణివంకా కూడ ఒకటి రెండుసార్లు చూశాడు. ఆ కిటికీలోనుంచి కనబడే దృశ్యాన్ని తాములేక, తమిద్దరిలో ఒకరుగాని చూసి ఉండచ్చని అతడు పసిగట్టాడా?

జలజ మళ్ళీ వెనక్కి వచ్చేసరికి కాంతారావు అక్కడ లేడు. అప్పటికే వెళ్ళిపోయాడు.

ఆమె పేవ్ మెంట్ మీద నడుచుకుంటూ ముందుకు వెళ్ళింది. వీధిచివర మందుల షాపులో స్టూలుమీద కూర్చుని సిగరెట్ పొగని రింగులు రింగులుగా వదులుతున్నాడు

మాసిన హ్యాట్ వ్యక్తి.

హోటల్లో ఫోంచేసుకుని ఇంటికి వచ్చిన జలజకు మరో ఘోరవార్త తెలిసింది. రాగిణి లారీ యాక్సిడెంట్ లో మరణించిందని.

4

రిక్షా కేకేసింది జలజ. అందులో ఎక్కి గవర్నమెంటు హాస్పిటల్ చేరుకుంది.

శవాల గదిదగ్గర రాగిణి మేనమామ రాజారావు పోలీసులు అడిగే ప్రశ్నలకు విసుగ్గా జవాబు చెబుతున్నాడు.

“ఆమెకు ఆత్మహత్య చేసుకోవాలని కోరిక ఉంటే ఉండుగాక. అదీ నాతో ఉన్నప్పుడే చావాలా? ఇప్పుడిది నా చావుకు వచ్చింది!” అంటున్నాడు రాజారావు.

“ఇప్పుడు ఆ చనిపోయిన అమ్మాయిమీద చిందులు త్రొక్కితే ఉపయోగం ఏమిటి? కాస్త నిదానించి జరిగిన విషయం చెప్పు!” అని అడిగాడు సార్జెంట్.

“చెప్పేందుకేముంది. ఈ ఊళ్ళో నా టేప్ రికార్డర్ రిపేరుకు ఇచ్చాను. అది తీసుకు వెడదామనే ఇవాళే మా ఊరునుంచి వచ్చాను. మా మేనగోడల్ని కూడ చూసిపోదామని వచ్చి ఆమెతో మాట్లాడాను. ఇద్దరం హోటల్ లో కాఫీ త్రాగి వస్తున్నాం. రోడ్డు దాటాల్సి ఉంది. ట్రాఫిక్ సిగ్నల్ ఎరుపురంగు వెలుగుతోంది. అందుకని పేవ్ మెంట్ మీదే ఆగాం. మా వెంట ఇంకా జనంగూడ ఉన్నారు. అంతలోనే రాగిణి రోడ్డుకడ్డంగా పడిపోయింది. స్పీడ్ గా వస్తున్న ట్రక్ క్రింద పడిపోయింది.”

“ట్రక్ డ్రయివర్ కథనం ప్రకారం ఆమెను ఎవరో బలవంతంగా తోసివుండాలట!”

వెంటనే జలజ కలుగ జేసుకుంది. క్లుప్తంగా మూర్తి

మరణం గురించి, తను సాక్ష్యమిచ్చిన రీతి చెప్పింది.

"ఎవరో మూర్తిని హత్య చేశారనే నా అనుమానం. అప్పుడు నేను రాగిణి ఉండే హాస్టల్లో ఆ రోజు నేనున్నాను. రాగిణి ఆ ఉదయమే తన బాస్‌తో క్యాంప్ వెళ్ళింది. హంతకుడు నన్నే రాగిణి క్రింద పొరబడి ఉంటాడు. అదను చూసుకుని ఆమె నీ యాక్సిడెంట్‌కి గురిచేశాడు" ఆవేశంగా అంది జలజ.

రాజారావు ఆమె మాటలు వింటూనే కొయ్యబారిపోయాడు.

సార్జెంట్ జలజవంక ఆశ్చర్యంగా చూశాడు. "మూర్తి మరణం తాలూకు సాక్ష్యమిచ్చిన అమ్మాయివి కదూ?" అంటూ ఆమెను నఖశిఖపర్యంతం చూశాడు.

జలజ హాస్పిటల్ నుంచి ఇంటిదోవ పట్టింది. సైకిల్ రిక్షాగాని, ఆటోరిక్షాగాని పిలిచి అందులో ఎక్కిపోవాలన్న ఆలోచనే రాలేదు ఆమెకు. ఆమె మనసు మనసులో లేదు. ఆమెను భయం ఆవరించింది. మూర్తిని హత్య చేసిన వ్యక్తే రాగిణినిగూడ చంపాడు. రేపు అతడు తన పొరబాటుని గ్రహిస్తాడు. అతడు హత్య చేస్తుండగా చూసింది రాగిణి కాదు జలజ అని. ఆ తర్వాత తనుగూడ ఏ పైఅంతస్తులోని కిటికీలోంచి జారిపడడమో లేక, స్పీడుగా వచ్చే ట్రక్కు క్రిందనో పడి రాగిణిని చేరుకుంటుంది.

"చూడండి! మీ మనసు ఏం బాగోలేదు. ఇలాంటి పరిస్థితిలో మీరు ఒంటరిగా వెళ్ళటం మంచిదికాదు. నేనుగూడ మీ ఇంటిదాకా వస్తాను" అన్నాడు కాంతారావు.

జలజ ఇంకా భయపడింది. ఇతడు తనను నీడలా వెంటాడుతున్నాడు. కొంపదీసి ఇతడే తననూ రైలెక్కించే వ్యక్తి కాదుగదా!

"మీరు బాగా అలిసిపోయినట్టున్నారు. హోటల్లో కెళ్ళి కాస్త డ్రింక్ పుచ్చుకుందురుగాని! రండి!"

అచేతనంగా ఆమె కాంతారావు వెనుకే వెళ్ళింది. అతణ్ణి తను అనుమానిస్తూనే ఉన్నది. కాని అతగాణ్ణి కాదనలేకపోతున్నది. ఇతడి మాటల్లో, చూపుల్లో ఏదో సమ్మోహనశక్తి ఉన్నదని అనుకుంది మళ్ళీ జలజ.

సరస్వతి తనను ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలు గురించి చలోక్తులు చెప్పాడు కాంతారావు. జలజ కొంత స్తిమిత పడింది.

"చూడండి! మీరు మనసులో లేనిపోని అనుమానాలు పెట్టుకుని బాధపడకండి!" అని ఓదార్చాడు.

"ఇంకా అనుమానం ఏముందండీ! రాగిణి హత్య చేయబడిందని ఖచ్చితంగా చెప్పగలను. ఆ తర్వాత నామీద కూడ హత్యాప్రయత్నం చేయబడవచ్చు."

"నా అభిప్రాయం రాగిణి ఏక్సిడెంట్ కి గురి అయిందనే. ఆమె మేనమామకూడ ఆమె వెంటనే ఉన్నాడు గదా. ఆమెపై ఎవరన్నా హత్యాప్రయత్నం చేసివుంటే అతడూ గమనించి ఉండేవాడేగదా? అదిగాక మీరు ఎవరో హత్యచేశారే అనుకుందాం. హంతకుడు తన ఆచూకీ దొరక్కుండా తప్పించుకున్నాడు. ఇక అతడికి రాగిణిని చంపాల్సిన పనేముంది?"

"అంతేనంటారా?"

"అంతేకాదు. మీరు కేవలం ఎవరిదో నీడమాత్రమే చూడగలిగారు. అతడిముఖం చూడలేదుగదా?"

"లేదు! నీడమాత్రమే ఛాయామాత్రంగా కనుపించింది!"

"అతడు పొడుగో, పొట్టివాడో కూడ చెప్పలేరు?"

లేదన్నట్టు తల ఊపింది జలజ. ఇదేమిటి? ఇతగాడు

ఎక్కడ మొదలెట్టినా మూర్తి మరణం దగ్గరకు లాక్కొడు తున్నాడు. ఆ వివరాలే అడుగుతున్నాను! కాంతారావు మీద చెప్పలేనంత కోపం వచ్చింది ఆమెకు. మళ్ళీ అతన్ని గురించిన అనుమానాలు ఆమెలో బలపడసాగినై.

తను ఇంటికి వెళ్ళి చేతులు ముడుచుకుని కూర్చుంటే లాభంలేదు. తన ప్రాణాల మీదకూ ప్రమాదం వస్తుంది. వెంటనే తను ఏదో ఒకటి చెయ్యాలి. కాలం గడిచిపోతే సాక్ష్యాలూ, ఆధారాలు మాయమవుతై. అయితే తను ఏం చెయ్యాలి? ఎక్కడ మొదలెట్టాలి.

ఇంతవరకూ తన దృష్టిలో ఇద్దరు వ్యక్తులు కనబడు తున్నారు, అనుమానితులుగా. ఒకడు మాసిపోయిన హ్యాట్ వ్యక్తి! అతడి పేరు సూర్యం అని విన్నట్టుగా గుర్తు. రెండో వ్యక్తి కాంతారావు.

తను మూర్తి మరణం గురించి ఏమైనా ఆరాలు తీసి ఏవైనా ఆధారాలు పట్టుకుంటుందేమో అని ఈ కాంతా రావు తన వెంట నీడలాపడి తిరుగుతున్నాడా?

"ఇంటిదాకా దిగబెడతాను! పదండి!" అన్నాడు కాంతారావు.

మరో అరగంట గడిచేసరికి ఇద్దరూ రాగిణి ఇల్లు చేరు కున్నారు. లిఫ్టులో ఎక్కి మూడో అంతస్తు చేరుకున్నారు.

జలజ తలుపు తెరచి లోపలకు అడుగుపెట్టి ఆగిపో యింది. కాంతారావుకేసి చూసింది.

"గుడ్ నైట్!" అన్నాడు కాంతారావు.

ఆమె గుడ్ నైట్ అనబోయింది. ఆమె పెదవులు విడివడేలోగా అతను ఆమె పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

జలజ తేరుకునేసరికి అతడు లిఫ్టులో ఎక్కి క్రిందకు వెళ్ళిపోయాడు.

తలుపు లోపల గడియవేసుకుని అలాగే తలుపుకానుకుని నిలబడింది జలజ. ఆమె పెదవులమీద తీయదనం ఇంకా మాసిపోలేదు. ఆమెకు కోపం, ఆశ్చర్యం కలిగినయ్. కాంతారావ్ చిలిపితనానికి ఆమె మెచ్చుకోలేకుండా ఉండలేకపోయింది. మగవాడిలో ఆమాత్రం తెగింపు లేకపోతే "థ్రిల్" ఏముంది? అనుకుంది.

అప్పటిదాకా చీకట్లోనే వున్న జలజ స్విచ్ వేసింది. లైటు వెలిగింది. నేలమీద కవరు కనబడింది. దానిమీద తన పేరే వుంది. పంపినవారి చిరునామా లేదు.

ఆత్రంగా కవరు విప్పి చదివింది. అది స్నేహలత అనే ఆమె వ్రాసింది. ఆమె చాలాకాలం తను ఉండే ఇంటికి ప్రక్క యింట్లో అద్దెకు ఉండేవాళ్ళు. ఈ మధ్యనే ఆమె భర్త ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కలాలు తయారుచేసే ఫ్యాక్టరీని పెట్టాడు. ఆ దగ్గరలోనే ఇల్లుగూడ కట్టుకుని అందులోకి మారిపోయారు. ఈ ఊరు వచ్చినప్పుడల్లా తనను చూడకుండా వెళ్ళరు ఆమె, ఆమె భర్త.

ప్రస్తుతం తను మకాం మార్చటం వలన వాళ్ళు ఈ ఊరు వచ్చినప్పుడు తనను కలుసుకోలేకపోయామని స్నేహలత రాసింది. సెలవు దొరికితే తమ ఇంటికివచ్చి రెండు రోజులుండి వెళ్ళమని కోరింది.

అంతలోనే ఆమెకు మూర్తి గుర్తుకు వచ్చాడు. రెండు సంవత్సరాల క్రితం స్నేహలత కొడుకు బర్త్‌డే పార్టీలో అతన్ని చూసింది తను. అంటే స్నేహలత భర్త సాధక మూర్తిని గురించి బాగా తెలిసి వుండచ్చు. రేపే తను వాళ్ళ ఊరికి వెళ్ళాలి అనుకుంది. ఈ దెబ్బతో తను హంతకుడి ఆచూకీని ఇట్టే పట్టేయగలదు అనుకొంది.

23
5

ప్రక్క వాటాలోని కుర్రవాడిచేత ఆఫీసుకు రెండు రోజులు సెలవు చీటీ పంపింది జలజ.

తన చీరెలూ, మరోజత అండర్ వేర్లూ బ్రీఫ్ కేసులో సర్దుకుని సిటీబస్ ఎక్కి బస్ స్టాండ్ చేరుకుంది. రోడ్డు రవాణాసంస్థవారి బస్సులో అరగంట ప్రయాణంచేసి స్నేహలత వాళ్ళ గ్రామం చేరుకుంది.

అసలు ఆ గ్రామంకూడ సిటీ లిమిట్స్ లోదే. అయితే ఊరికి దూరంగా అంతకంతకూ పెరిగిపోతున్న ఇండస్ట్రియల్ ఎస్టేట్ కి పెద్ద జాగా ఉండాలని దూరంగా కట్టారు. అక్కడికి పోవాలంటే దాదాపు పాతుగూరు పోయినట్టే ఉంటుంది.

ఆ కుగ్రామంపేరు కార్మికనగర్. ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో పనిచేసేవారి కాలనీ అది.

రిక్షాలోంచి దిగుతూండగానే లోపల్నుంచి స్నేహలత బయటకు వచ్చింది తనను గుర్తించి.

"ఏమిటిలా హఠాత్తుగా ఊడిపడ్డావ్! వస్తున్నట్టు ఉత్తరమన్నా రాయకపోయావా? కాకు పంపేవాళ్ళం గదా?" స్నేహలత ఆప్యాయంగా అంది.

"మరేం కంగారు లేదులే! మనం కలుసుకొని చాలా రోజులయింది. నీ ఉత్తరం చదవంగానే ఎందుకో నిన్ను చూడాలనిపించింది. అంతే! ఉన్నపళంగా వచ్చేశాను."

"మంచిపని చేశావ్!" అంటూ ఆమె చెయ్యి పుచ్చుకుని జలజను లోపలకు తీసుకుపోయింది స్నేహలత.

ఆ ఇల్లు అధునాతనంగా కట్టబడింది. ఇంటిచుట్టూ బోలెడంత పెరడువుంది. రకరకాల వృక్షాలున్నాయ్. చెట్లమీద పక్షులు అరుస్తుంటే ఆ పల్లె వాతావరణానికి జలజ మురిసిపోయింది. పట్టణాల్లో వుండే రద్దీ, రణగొణ

ధ్వనులూ లేని పల్లె వాతావరణం అంటే జలజకు చాలా ఇష్టం. అందుకే ఆమె అప్పుడప్పుడు ఇక్కడకు వచ్చి నాలుగైదు రోజులు ఉండిపోతూ ఉంటుంది.

స్నేహలత స్టౌ వెలిగించి కాఫీ పెట్టింది. వంటశాలలో డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని కాఫీ సిప్ చేస్తూన్నారు.

జలజ నిదానంగా అడిగింది. "సిటీలో మూర్తి ఫొటో స్టుడియో యజమాని మూర్తి తెలుసా మీకు?"

"తెలియకేం? అతడీ మధ్య ప్రమాదవశాత్తు చనిపోయాడట! మాకు ఆ వార్త చాలా విచారం కలిగించింది. అతడు యీ ఊరు వచ్చినప్పుడల్లా మన ఇంటికి రాకుండా వెళ్ళే వాడుకాదు! మంచి ఫొటోగ్రాఫర్! అతడి మొదటి భార్యగూడ ఈ ఊళ్ళోనే ఉంటోంది!" అన్నది స్నేహలత.

స్నేహలత ఇంటి ఆవరణలోనే మరో ఇల్లువుంది. అందులో ప్రస్తుతం ఎవరూ వుండటంలేదనీ, దాన్ని తన భర్త సారథి లేబరటరీ క్రింద లైబ్రరీ మరియు రీడింగ్ రూమ్ క్రింద వాడుతున్నాడని చెప్పింది.

జలజ తన దుస్తులు మార్చుకుంది. స్నేహలత వంట పనిలో నిమగ్నురాలైంది. పిల్లలు బడికి వెళ్ళారు. సారథి ఫ్యాక్టరీకి నిన్న అనంగా వెళ్ళి ఇంకా రాలేదట. అది అతనికి అలవాటే అంది స్నేహలత.

ఎదురుగా కొండరాళ్ళతో కట్టబడివున్న పాత ఇంట్లోకి వెళ్ళింది జలజ.

ఒక గదినిండా లైబ్రరీ పుస్తకాలు, న్యూస్ పేపర్లూ ఉన్నాయ్. పుస్తకాల షెల్ఫ్లలోకి చూస్తున్న జలజ ఆ ప్రక్కనే ఉన్న కిటికీలోంచి బయటకు చూసింది. ఆమె కెదురుగా మల్లెతీగలు, ఇంకా ఏవేవో చెట్లు పొదలుగా ఉన్నాయ్. అయితే ఇంతకుముందే ఆ పొదల్ని చీల్చు

కుంటూ అందులో ఎవరో దూరినట్టుగా చిందర వందర అయిన లతలే చెబుతున్నాయ్.

చేతిలోని పుస్తకం అక్కడే పడేసి ఆ పొదవైపుగా వెళ్ళింది.

ఆమె అనుమానం నిజమయింది. ఆ పొదలకు ఆవలి వైపున ఎవరో వ్యక్తి నిలబడి వున్నాడు. అతడు దొంగే కావచ్చు! లేకపోతే అలా చాటుమాటుగా నక్కి ఉండ వలసిన అవసరం ఏముంది?

"ఎవరక్కడ?" అంటూ నెమ్మదిగా అడిగింది.

ఆ వ్యక్తి పొదలచుట్టూ తిరిగి దోవ చూసుకుంటూ వచ్చాడు. అతన్ని చూసి జలజ ఆశ్చర్యపోయింది. అతడు కాంతారావు.

"మీరు ఇక్కడికెలా వచ్చారు?" జలజ ఆశ్చర్యంగా అడిగింది.

"నేనే మిమ్మల్ని ఆ ప్రశ్న అడుగుదామనుకున్నాను" కాంతారావు మళ్ళీ ప్రశ్నించాడు.

"సారధి భార్య స్నేహలత నా స్నేహితురాలు. ఆమెను చూడాలనిపించి వచ్చాను!"

"నేను ఇక్కడకు రావటానికి కారణం సరస్వతి! ఆత్మకథ ఎక్కడనుంచి మొదలెట్టాలి అని అడిగాను. ఈ ఊరికీ, మూర్తి జీవిత ధ్యేయం అయిన ఫొటోగ్రఫీకిచాలా బాంధవ్యం ఉన్నదని చెప్పింది. అందుకే వివరాలకోసం ఇక్కడకు రావాల్సి వచ్చింది."

అనుమానపు మేఘాలు కమ్ముకున్నాయ్ ఆమెలో. ఇతడు తనను నీడలా వెంబడించటం లేదుగదా? తన బ్రతుకు ఇతడి చేతుల్లోనే తెల్లారిపోతుందా ఏం?

"నిజంగా ఈ పల్లె వాతావరణం అంటే నాకు భలే ఇష్టం!" అన్నాడు కాంతారావు.

“అవునవును! నాకూ అంతే!” అంది జలజ తన మనసులోని భావాల్ని కప్పిపుచ్చుకుంటూ.

“అయినా మీరు అంటే అందమైన స్నేహలతే బంగళా వదిలి ఈ భూత్ బంగళాలోకి వచ్చారేమిటి?”

“అదా? ఇక్కడ లైబ్రరీ ఉందంటే వచ్చాను. ఆ పుస్తకాలన్నిటినీ తీరికగా చదివేసెయ్యొచ్చుగదా అని నా ఆశ.”

అంతలో సారథి లోపలకు వచ్చాడు. “జలజా! ఎప్పుడు వచ్చావ్! మేం ఆమధ్య మీ ఊరు వచ్చాం. నీవు ఇల్లు మార్చావట. అందుకని ఉత్తరం రాసి మీ ఇంటి ప్రక్క ఇంట్లో కుర్రవాడికి ఇచ్చి వచ్చా. అందిందా అది.”

“అందిందండి! ఆ ఉత్తరాన్ని చూడంగానే స్నేహలతను చూడాలనిపించింది. వచ్చేశాను. అన్నట్టు మరిచాను. ఇతను నా ఫ్రెండ్! పేరు కాంతారావు. స్వర్గీయ మూర్తిగారి ఆత్మకథను రచించబోతున్నాడు” అంటూ ఇద్దర్నీ పరిచయం చేసింది.

“మూర్తికి ఆత్మకథా? వాడేం నాయకుడా? లేక చెప్పుకోదగ్గ గొప్ప వ్యక్తా? అయినా ఆ సరస్వతికి డబ్బు ఎక్కువగా వున్నట్టుంది. లేకపోతే అంత ఖర్చుతో ప్రింట్ చేయిస్తుందా?” సారథి విసుగ్గా అన్నాడు.

“ఆ విషయాలన్నీ సరస్వతి ప్రేరణవల్లనే నేను సేకరించాలని వచ్చాను. మూర్తి ఈ ఊళ్లో కొన్నాళ్ళున్నాడటగా?” కాంతారావు అడిగాడు.

“నాకూ బాగా తెలీదు! ఇవాళ రాత్రికి మా ఇంట్లో పార్టీ ఏర్పాటు చేస్తున్నాం. మా రెండో అబ్బాయి బర్త్ డే! ఊళ్లో ప్రముఖులు చాలామంది వస్తారు. వారిలో చాలామందికి మూర్తిని గురించి తెలుసు. అతని మొదటి భార్యగూడ ఈ ఊళ్లోనే ఉంటున్నది. ఆమెగూడ పార్టీకి

వస్తుంది. రాత్రికి మీరుగూడా తప్పకుండా రండి!"

"థ్యాంక్యూ సర్!"

"జలజా! పదమ్మా! మనింట్లోకి వెళదాం!" అంటూ సారథి ముందుకు నడిచాడు. జలజ అతడ్ని అనుసరించింది. కాంతారావు వెళ్ళిపోయాడు.

6

ఆ రాత్రి విందుకు అనేకమంది అతిథులు వచ్చారు. విందు చాలా వేడుకగా జరిగింది. కొందరు పాటలు పాడారు. మరికొందరు జంటలు డాన్స్ చేశారు.

కాంతారావుకూడా వచ్చాడు. జలజను ఒకమూలకు తీసుకువెళ్ళాడు.

"ఇక్కడకు వచ్చిన వ్యక్తుల్ని ఎవర్నీ మూర్తి గురించి అడగకు. ఎందుకంటే నీ ప్రశ్నలకు వాళ్ళు అనుమానపడొచ్చు. అదే నేను అడుగుతాను. ఆత్మకథకోసం అడిగానని అనుకుంటారు. ఎవరూ అనుమానించరు!"

"అలాగా?"

"అవును! ఈ రాత్రికి నీవు ఇక్కడే పడుకో! ఆ రాతి కొండల్లోకి వెళ్ళకు. అందులో దయ్యాలుంటాయని ఇక్కడి వాళ్ళ నమ్మకం."

జలజ నవ్వింది. "నాకు దయ్యాలంటే నమ్మకంలేదు."

మాట్లాడుతూనే జలజ ఇంకా లోపలకు వస్తున్న ఒక వ్యక్తిని చూసి కన్నార్పక ఆశ్చర్యానందంగా భయపడి పోయింది.

అతడు సూర్యం. మాసిపోయిన ఫోటోగ్రాఫ్‌లో చనిపోయిన మూర్తి ఆత్మకథ రాసే నెపంతో, స్టుడియోలోని డ్రాయరులో వెదుకుతూ తనకు దొరికిపోయిన వ్యక్తి.

తను వచ్చిన చోటికే కాంతారావూ, సూర్యం ఇద్దరూ

వచ్చారు. తనను వెతుక్కుంటూ వచ్చారా? లేక ఇక్కడ హంతకుల ముఠా ఏదన్నా ఉందా?

స్నేహలత మరో రెండు డ్రింక్స్ తెచ్చి జలజకూ, కాంతారావుకూ అందించింది.

* * *

జలజకు మెలకువ వచ్చేసరికి ఇంకా తెల్లారలేదు. అయినా ఎవరో అప్పుడే నేల ఊడుస్తున్న చప్పుడు స్పష్టంగా వినవస్తున్నది ఆమెకు.

రాత్రి విందులో అతిథుల పాటలూ, కేరింతలూ, నవ్వులూ అన్నీ ఆమె మనసులో మెదిలినయ్. స్నేహలత డ్రింక్ గ్లాసులు తెచ్చి ఇవ్వటం వరకే తనకు బాగా గుర్తు. ఆ తర్వాత ఏం జరిగిందీ తనకు గుర్తురావటంలేదు. తలకాయ బద్దలు కొట్టుకున్నా కళ్ళు తెరచితే సెక్కడనుంచీ గుర్తుకు తెచ్చుకోవటానికి యత్నించింది.

తను పాతబడిన ఆ రాతికట్టడంలో వుంది. మంచం, దానిమీద పరుపు, దానిమీద తను వుంది. విందుకాగానే తను కట్టుకున్న ఫారిన్ నైలెక్స్ చీర విప్పేయాలనుకుంది. కాని తను ఆ చీరతోనే బెడ్ మీద వుంది.

అంతలోనే ఆమెను మళ్ళీ తీయని మత్తు ఆవహించింది. మంచి నిద్రలోకి జారుకునే వ్యక్తిలా ఆమె కళ్ళుమూతలు పడిపోయినయ్.

మళ్ళీ మెలకువ వచ్చేసరికి బారెడు ఎండ పడుతోంది. నోరంతా అసహ్యంగా వుంది. తన జీవితంలో ఏనాడు లేనంతగా రాత్రి నిద్రపోయింది. అంటే! అంటే తనకు ఏదన్నా మత్తుమందు ఇచ్చారా ఉండా? లేకపోతే తను డ్రస్ కూడ మార్చుకోకుండా ఎలా పడుకోగలదు?

దగ్గరగా వేసివున్న తలుపుల్ని తోసుకుని స్నేహలత వచ్చింది. "జలజా! టిఫిన్, కాఫీ చల్లారిపోతున్నయ్.

ముఖం కడుక్కో!" అంది.

"ఇదిగో అయిదు నిముషాల్లో వచ్చేస్తున్నాను!" అంటూ జలజ ఎదురుగా టేబుల్ మీద వున్న తన బ్రీఫ్ కేస్ తెరిచింది. టూత్ బ్రష్, పేస్టూ తీసుకుని బాత్ రూమ్ కేసి నడిచింది.

ప్లేట్ లోని ఉప్మా చెంచాతో తీసి నోట్లో పెట్టుకుంటుండగా స్నేహలత అడిగింది. "పార్టీ అయిపోకుండానే నువ్వు నిద్రలోకి జారుకున్నావేంటి? పాపం! రాత్రి ఎక్కువసేపు నిద్ర నాపుకోలేనట్లే వుంది! అవునా?"

"అదే నాకూ అంతుపట్టడంలేదు. రాత్రి పదకొండు గంటల తర్వాత ఏం జరిగిందో నాకు గుర్తులేదు!"

"పార్టీ సగంలో వుండగా నేను నీకోసం చూశాను. అప్పటిదాకా నువ్వు అందరితోనూ కులాసాగా కబుర్లు చెబుతున్నావట. నేను చూసేసరికి ఒక మూల కుర్చీలో వాలిపోయి నిద్రపోతున్నావ్! నేనే తీసుకెళ్ళి బెడ్ రూమ్ లో పరుపుమీద పడుకోబెట్టాను. మరో గంటపోయాక వచ్చి చూస్తే అక్కడా లేవు. నిద్రలోనే నువ్వు లైబ్రరీ రూమ్ లోకి వెళ్ళి వుంటావ్! రాత్రి చాలా వేడుకగా వుందిలే! ముసలీ ముతకా అందరూ జంటలు జంటలుగా బాల్ రూమ్ డ్యాన్స్ చేశారు. మన ప్రక్కింటి లత లేదూ, అదేమో రికార్డు డ్యాన్స్ చేసింది."

శారధ లోపలకు వచ్చాడు. అతడి కళ్ళు ఎర్రగా నిద్రలేని వాడికళ్ళలా వున్నయ్. ముఖం అదోరకంగా పెట్టుకున్నాడు. "నేను ఫ్యాక్టరీ దాకా వెడుతున్నాను" అన్నాడు.

"ఇవాళ కూడా ఇంత పెందలాడే వెళ్ళాలా? జలజ వచ్చింది! కులాసాగా ఇంట్లో గడపకూడదూ?"

"వీల్లేదు. అర్జెంటుపనివుంది. నే వెళ్తున్నాను!" అంటూ

సారథి సమాధానంకోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు.

“ఏమిటో జలజా! ఈమధ్య ఈయన పూర్తిగా మారిపోయారు. ఒక్క క్షణం ఇంటిపట్టున వుండరు. ఫ్యాక్టరీలో ఎవరో కూలీదాని వలలో పడ్డారని విన్నాను. అదేమని అడిగితే పోట్లాటకొస్తారు. డబ్బుకు కొదువలేదుగదా అనుకుంటే ఈ బెడద ఒకటి!”

జలజ స్నేహలత చెబుతున్నదాంట్లో ఆసక్తి చూపించలేదు. ఆమె ఇంకా రాత్రిని గురించే ఆలోచిస్తున్నది. తనూ, కాంతారావ్ ఇద్దరూ ఒకేసారి డ్రింక్స్ తీసుకున్నారు. మరి అతడూ మత్తుగా పడిపోయాడా?

కాంతారావుని గురించి అడిగింది.

“అతడూ, మూర్తి మొదటిభార్యగూడ వచ్చిందిగదా ఇద్దరూ చాలాసేపు డ్యాన్స్ చేశారు, మాట్లాడుకుంటూ. ఆ తర్వాత ఆమెతో వాళ్ళింటికి వెళ్ళిపోయాడు.”

జలజ ముఖంలో రంగులు మారినయ్. అయినా తమాయించుకుంది.

“కాంతారావు ఎవరింట్లో ఉంటున్నాడు?” జలజ అడిగింది.

“మూర్తికి స్వంత యిల్లువుంది ఈ ఊళ్ళో. ప్రస్తుతం దాంట్లో వుండడంలేదు, సరస్వతి సిటీలోకి మకాంమార్చిన తర్వాత. ఇతడు అక్కడే మకాం చేస్తున్నాడు.”

కాసేపు ఆ విషయాలు ఈ విషయాలూ మాట్లాడుకున్న తర్వాత జలజ ఊళ్ళోకి వెళ్ళొస్తానని చెప్పి బయలుదేరింది.

పావుగంట నడిచి ఊరి చివరంటా వెళ్ళింది జలజ. అక్కడ ఎత్తైన గుట్టవుంది. దానిమీద నిల్చుంటేఊరంతా మ్యాప్‌లోలాగ కనుపిస్తున్నది. ఒకవైపు చివరగా పెంకుటిల్లు మిగతా ఇళ్ళకు దూరంగా కనుపిస్తున్నది. అదే

సరస్వతి ఇల్లు. ఎవరో సేద్యం చేసుకునే మనిషి ఆ ఇంటి కెదురుగా పాక వేసుకుని తన కాపురంతో వుంటున్నాడు. అతడే ఈ ఇల్లుని కనిపెట్టుకుని వుంటాడట!

జలజ ఆ పెంకుటిల్లు వైపుగా నడిచింది. ఆ ఇల్లు బాగా పాతబడిపోయింది. కప్పుమీద పెంకులు ఒకటి అరా లేచిపోయినయ్.

ఇంటిముందుకు వెళ్ళి "కాంతారావుగారూ!" అని పిలిచింది. సమాధానం రాలేదు.

వారగా వేసివున్న తలుపు తెరుచుకుని లోపలకు వెళ్ళింది. ముందు హాల్లో ఎవరూ కనుపించలేదు.

మళ్ళీ పిలుద్దామనుకునేంతలో లోపల్నుంచి మాటలు వినబడినయ్. జలజ అలానే ఆగిపోయింది. ప్రక్కనున్న కిటికీలోంచి చాటుగా నిల్చుని లోపలకు చూసింది.

కాంతారావు కుర్చీలో కూర్చునివున్నాడు. అతని కెదురుగా మంచంమీద మరో స్త్రీ విలాసంగా పడుకుని వుంది.

ఆమెకు పాతికేళ్ళ వయసు వుంటుంది. చాలా అందంగా వుంది. కోలముఖం, నంకీల జుట్టు, మెడలో నగలూ. మనిషి ఆకర్షణీయంగా కనుపిస్తోంది.

"నన్ను కలుసుకోవటంకోసం ఇంతదూరం రాకుండా వుండాల్సింది. మామయ్యకీ విషయం తెలిస్తే ఇంకేమన్నా వుందా? అందుకని నన్ను కలుసుకున్నట్టు ఆయనకు తెలియనివ్వకు!"

ఆమె నవ్వుతూ తలూపింది.

"ఆ విషయం నాకూ తెలుసు! కానీ నిన్ను చూడకుండా వుండలేకపోయాను. ఆయన్ను చూస్తుంటే నాకు ఏమీ తోచటంలేదు. ప్రక్కన నీవన్నా వుంటే నాకు కొంచెం ధైర్యంగా వుండేదనుకుంటే నీవూ ఊళ్ళవెంట

తిరుగుతుంటివి! నిజంగా వ్యవహారంమీదే తిరుగుతున్నావా? లేక ఆ అమ్మాయి ఎవరో నీ అభిమానం చూరగొన్నదని చెప్పావే, ఆమె వలలోపడి నన్ను మరిచిపోయావేమో అనుకున్నాను!''

"నీ స్త్రీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు! నీ కా సంశయం అక్కర్లేదులే!'' కాంతారావు లేచి ఆమె నడుంచుట్టూ చెయ్యిపోనిచ్చి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

ఆ పైన దృశ్యం జలజ చూడలేకపోయింది. అడుగుల చప్పుడు కాకుండా ఆ ఇంట్లోంచి బయటపడింది.

కాంతారావుని చూసి అతడు చాల మంచివాడని భ్రమించింది. అతడు మరో స్త్రీతో, అదీ వివాహిత అయినదీ, బంధుత్వంగలదాన్ని తన వలలో వేసుకున్నాడు. ఇంత నయవంచకుడని తను ఊహించలేకపోయింది.

7

సాయంత్రం నాలుగు గంటలయింది.

స్నేహలత ఇంటి వెనుకగా ఒక ఫర్లాంగు దూరంలో పంటకాలువ పారుతోంది. గొడ్లకాపరులు కొందరు అందులో చేపలు పడుతుంటారు.

ఒక కుర్రాడి గాలానికి ఏదో బరువుగా తగిలింది. అతడు పైకిలాగాడు. కాని గాలానికి తగిలిన వస్తువు నీళ్ళ మీదకు కనపడి ఆగిపోయింది. అది మనిషి చెయ్యి. ఎక్కువ లోతులేని ఆ పంటకాలువలో ఎవరిదో శవాన్ని పడేశారన్నమాట.

ఆ కుర్రవాడు ఏదో దయ్యాన్ని చూసి భయపడ్డట్టుగా పెద్దగా అరిచాడు. ఇంకా కుర్రాళ్ళు పోగయ్యారు.

ధైర్యంగలవాళ్ళు కొందరు కాలవలోకి దిగి మొలబంటి నీళ్ళలోని శవాన్ని గట్టుమీదకు లాగారు.

ఊళ్లో కరణానికీ, మునసబుకూ ఈ వార్త వెళ్ళింది. ఊళ్లోని జనం చాలమంది అక్కడకు మూగారు.

ఆ చనిపోయిన వ్యక్తి ముఖం వికృతమైపోయి గుర్తుపట్టటానికి వీల్లేకుండా వుంది. అతడికి పాతిక, ముప్పయ్యేళ్ళు వుండవచ్చు. అతడి జేబుల్లోకూడ అతని ఊరు పేరూ తెలిపే ఆధారాలేం కనుపించలేదు.

జలజ నిద్ర లేచేసరికి ఈ విషయమే ఊరంతా చెప్పుకుంటున్నారు.

జలజకు అంతా అయోమయంగా కనుపించసాగింది. ఒక సమస్యను తను విడదీయాలనే ప్రయత్నంలో వుండగా తన స్నేహితురాలు చనిపోయింది. ఇక్కడేదో సమాచారం దొరుకుతుందని వస్తే ఇక్కడ మరో శవం స్వాగతం పలుకుతోంది.

శవపరీక్షలో, అతడు చనిపోయి రెండురోజులకన్న ఎక్కువ అయివుంటుందని తేల్చారు.

పోలీసులకు అంతకన్నా ఆధారం ఏమీ దొరకలేదు. ఊళ్లో ఎవరూగూడ హతుడ్ని గుర్తుపట్టలేకపోయారు. అంటే అతడు తప్పకుండా పొరుగూరువాడై వుండాలి.

ఆ ఊరికి వచ్చే బస్సు కండక్టర్లందర్నీ వాకబుచేశారు, పోలీసులు, చనిపోయిన వ్యక్తి దుస్తుల్ని వర్ణించి చెప్పి.

ఒక కండక్టరు తనకు గుర్తున్న సమాచారం చెప్పాడు. ఆ వ్యక్తి తన బస్సులోనే వచ్చాడన్నాడు. దిగవలసిన స్టాప్‌లో దిగక పై స్టాప్ దాకా రావటంవలన అతడికీ, కండక్టరుకూ చిన్న వాగ్వివాదం జరిగింది. అందువల్లనే అతడు కండక్టరుకూ బాగా గుర్తున్నాడు.

అతడి చేతిలో బ్రీఫ్ కేస్, హ్యాట్ చూశానని చెప్పాడు.

పోలీసులు మళ్లీ కాలువ దగ్గరకు పరుగెత్తారు. మనుషుల్ని నీళ్ళలోకి దింపి బ్రీఫ్ కేస్ కోసం వెదికించారు. కానీ దొరకలేదు. నీళ్ళలో తడిసి నానిపోయిన ఈవెనింగ్ హ్యాట్ మాత్రం దొరికింది.

పోలీసులు జలజ దగ్గరకు వచ్చారు.

"చూడండీ! ఈ హ్యాట్ మాత్రం దొరికింది కాలువలో. ఇది ఈ ఇంట్లో వ్యక్తులెవరిదన్నా నాదా?" అని అడిగాడు ఇన్స్పెక్టర్.

ఆ హ్యాట్ ని చూస్తూనే కంగారుపడింది జలజ.

దాన్ని మొదటిసారిగా తను మూర్తి స్టుడియోలో చూసింది. ఇంటర్వ్యూకు వచ్చిన వ్యక్తుల్లో ఒకడైన సూర్యారావుది అది.

8

"చూడమ్మాయ్! ఆ నానిపోయిన వ్యక్తి ఎవరో ఈ ఊళ్లోని వ్యక్తులెవరూ గుర్తుపట్టలేకపోయారు. అయితే నీవా హ్యాట్ ని ఎక్కడో చూశానని చెబుతున్నావ్! నీవు చెప్పేది కరెక్టేనా? ఆలోచించుకుని చెప్పు!"

జలజ ఒక నిముషం ఆలోచించింది. "ఆ హ్యాట్ ని ఒకసారి కాదండీ! అనేకసార్లు చూశాను. మొదటిసారి మూర్తి స్టుడియోలో సరస్వతి వద్దకు ఇంటర్వ్యూకు వచ్చాడు ఆ వ్యక్తి. తన పేరు సూర్యం అని చెప్పాడు. తన మురికి హ్యాట్ ని అందమైన పులిబొమ్మమీద తగిలించాడు. పులిబొమ్మ అందంగూడ చెడగొడుతున్నదే ఈ హ్యాట్ అనుకున్నాను.

"తర్వాత అతను దాన్ని నెత్తిమీద వుంచుకుని అదే స్టుడియోలోని డ్రాయరు తెరచి వేటికోసమో వెదుకుతూండగా చూశాను. మరోసార అతను మందులషాపులో

కూర్చుని సిగరెట్ త్రాగుతున్నాడు. అతని తలమీద ఉన్న ఆ టోపీ మూలంగానే అతగాడిని త్వరగా గుర్తు పట్టగలిగాను.”

తను మూర్తి స్టుడియోలో చూసిన నీడలూ, ఆతర్వాత మూర్తి కిటికీలోంచి క్రిందకు పడిపోవడం, దాన్ని హత్యగానే తాను భావించి అందుకే సాక్ష్యం ఇచ్చినదైనాన్నీ, ఆ తర్వాత రాగిణి ఎటువంటి పరిస్థితుల్లో చనిపోయిందీ అన్నీ వివరించి చెప్పింది.

ఇన్స్పెక్టర్ రాజేంద్ర అన్నిటినీ నోట్ బుక్ లో వ్రాసుకున్నాడు.

9

సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజనరావు కుర్చీలో కూర్చుని మూర్తి మరణం గురించిన ఫైలుని తిరగేస్తున్నాడు.

జలజ ఇచ్చిన సాక్ష్యంలో ఏమాత్రమో నిజం వుండి వుంటుందని అతడు అనుమానించాడు. రాగిణి ఎలా చనిపోయిందీ తెలుసుకున్న తర్వాత అతడు నిట్టూర్పు విడిచాడు.

మూర్తిని తుదముట్టించిన హంతకుడి వెనుక పెద్ద వలయం వుండి వుంటుంది. అంతేకాదు. వాళ్ళు చాలా తెలివైనవారు. హత్యల్ని ఏక్సిడెంట్ లా కనబడేటుగా మార్చివేయగల చతురులు. ఇప్పుడు హత్య వెంట హత్య జరిగినయ్. మూర్తి చావు, ఆ తర్వాత రాగిణి, ఆ తర్వాత సూర్యం. ఆపైన ఎవరికి మూడిందో!

ఆ ఛాన్సు కొంతవరకు జలజకే ఉంది.

ఆ కేసుని తనే స్వయంగా పరిశోధించాలనుకున్నాడు నిరంజనరావు.

అతడు ముట్టమొదటగా కలుసుకున్న వ్యక్తి సరస్వతి.

ఆమెకు తమ డిపార్టుమెంటువారు సేకరించిన విషయాలన్నీ చెప్పాడు.

“చూడండీ! నేను చెప్పిన ఆధారాల్ని బట్టి మీ భర్త ప్రమాదవశాత్తూ చనిపోలేదనీ, ఎవరో హత్య చేసి వుంటారనీ భావించాల్సి వస్తోంది!” అన్నాడు.

సరస్వతి గుండెలు బాదుకుంటూ ఏడవసాగింది. “నేనేం చెయ్యాలనుకో భగవంతుడా? అంతపనీ ఆ ముండ చేయిస్తుందని నాకు ఏనాడో తెలుసు!” అని శోకశోకాలు పెట్టింది.

“ఎవరమ్మా! ఎవర్ని మీరు అనుమానించింది?”

“అదేనండీ! ఆయన మొదటిభార్య!”

“ఆమె లేచిపోయిందిగా? ఇంకా ఇద్దరికీ ఏం సంబంధం?”

“లేకేమండీ? నన్ను పెళ్ళాడి మూర్తి భగవంతుడయ్యాడుగా? పల్లించుట్టూ చీమలు మూగినట్టుగా అతడ్ని వదలలేదు ఆమె. మూర్తిగూడ ఆమెకోసం నాలుగైదుసార్లు ఆ ఊరు వెళ్ళాడు. నాకు ఆ విషయం తెలిసి గట్టిగా మందలించాను—నేనో, ఆమే ఇద్దరిలో ఎవరు కావాలో తేల్చుకోమని! అతడు నా పక్షమే అవుతాడని నాకు గట్టిగా తెలుసనుకోండి!”

పోలీస్ ఫోటోగ్రాఫర్ వచ్చాడు. మూర్తి స్టుడియోని ఎదురింటి మేడమీదనుంచి ఫోటోలు తీశాడు. తర్వాత స్టుడియో అంతా వేలిముద్రలకోసం వెదికారు.

మూర్తి చనిపోయిన తర్వాత స్టుడియోనంతా కడిగించి శుభ్రం చేయించింది సరస్వతి, నీట్ గా ఉంచాలని. అందువల్లనే వేలిముద్రలు ఎక్కడా దొరకలేదు.

నిరంజనరావు స్టుడియోని పరీక్షించాడు. అందులో పడమరదిక్కుగా వాకిలి వుంది. దాని తలుపులు తెరిస్తే ఎండ

లోపలకు పడుతోంది. ఎవరన్నా వ్యక్తి అటునుంచి లోపలకు వస్తే అతడు కనబడకపోయిన ఎండపై నీడ అడ్డం వస్తుంది. అంతేకాదు. ఆ తలుపు ఎల్లప్పుడూ మూసేసి వుంటుంది. ఆ రోజున మాత్రం హంతకుడు ఆ తలుపు తెరుచుకొనే వచ్చాడు. అందరూ వచ్చే వాకిట్లోంచి వస్తే తనను ఎవరైనా గుర్తుపడతారని అలా చేసివుండచ్చు.

తర్వాత నిరంజనరావు స్టుడియోలోని ఫోటో లన్నిటినీ పరీక్షించి చూశాడు. కాని వాటిల్లో ఎటువంటి ఆధారాలు దొరకలేదు. మూర్తి చనిపోయిన నాటిరాత్రి ఆ ఇంట్లోకి ఎవరో దొంగ జొరబడ్డాడు. వాడు నిజంగా దొంగతనానికి వచ్చివుంటాడు. ఏదో అమూల్యమైన ఫోటోకోసమో లేక హంతకుని పట్టించే క్లూని ఎత్తుకుపోయి వుంటాడు.

సరస్వతి వద్దకు ఇంటర్వ్యూకి వచ్చిన నలుగురినీ గురించి మరోసారి వాకబు చేశారు పోలీసులు.

మొదటివ్యక్తి సూర్యం. సూర్యం ఆ వీధి చివరలో ఒంటరిగా రూమ్‌లో అద్దెకుండే వాడట. నెల నెలా టంచనుగా ఒకటో తారీకున అద్దె చెల్లించేవాడట. ఉదయం వెళ్ళిన వ్యక్తి రాత్రి పొద్దుపోయినదాకా వచ్చేవాడు కాదని చుట్టుపట్లవున్న వాళ్ళు చెప్పారు. అతడు ఎక్కడా ఉద్యోగం చేస్తున్నట్టు ఎవరికీ తెలీదు. మరి అతడు తన జీవితం ఎలా వెళ్ళమారుస్తున్నాడో భగవంతుడికే తెలియాలి.

అతడి గదితాళం పగులగొట్టి సోదా చేశారు. ఒక సూటు, చిరిగిపోయిన టెర్లిన్ చొక్కాలు రెండు, తుండ్లూ ధోవతలూ మాత్రమే వున్నాయి. ఇంక ఏవిధమైన కాగితాలు కానరాలేదు.

ఆ తర్వాత వ్యక్తి కమల. జలజ ఆమెను చాలాసార్లు చూసింది లోగడ. స్నేహలత ఇంటికి ఆమె తరచూ

వస్తుండేది. ఆమెనుగూడ విచారించగా తేలిన విషయం ఏమిటంటే ఆమె పత్రికల్లో వ్యాసాలూ, గేయాలురాస్తూ వుంటుంది. ఆమె గోర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏదో ఫ్యాక్టరీలో ఫోర్‌మెన్. అయితే ఆమెకు ఈ వుద్యోగం చేయాల్సిన అవశ్యకత వున్నట్టు తోచదు. అంటే మూర్తి జీవితానికి సంబంధించిన రహస్యాల్ని సంగ్రహించటానికి ఆ మిషతో వచ్చివుంటుంది.

మూడో వ్యక్తి కాంతారావు. కాంతారావు మద్రాసులో ఒక రూమ్ అద్దెకు తీసుకుని వుంటున్నాడు. దావాన్స కాలేజీలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినింగ్ పొందుతున్నాడు. చుట్టూ వుండేవారిని వాకబుచేయగా అతడు సత్ప్రవర్తనగలవాడని, అందరితో స్నేహంగా వుంటాడని తెలిసింది. ఇప్పుడిప్పుడే అతడు వ్రాసే కథలు పత్రికల్లో ప్రచురితమవుతున్నయ్.

కాంతారావుపై ఒకకన్ను వేసి వుంచమని ఒక సార్జెంట్‌ని పంపాడు.

అతడో ఆసక్తికరమైన సమాచారాన్ని సేకరించాడు. ఎవరో ఒక స్త్రీ కాంతారావు కోసం వచ్చి వెళ్ళింది. సార్జెంట్ ఆమె నివాసంలో అడిగాడు. కార్మికనగర్ గ్రామానికి పంచాయతీబోర్డు ప్రెసిడెంటు రాజారావు భార్య ఆమె!

నిరంజనరావు అతని వ్యక్తిగత జీవితంలోకి తరచి చూశాడు. అతడు నాలుగైదు దఫాలనుంచి ఏకగ్రీవంగా ప్రెసిడెంటుగా ఎన్నిక అవుతున్నాడు. మంచి ఆస్థిపరుడు. అతడిపై ఎటువంటి 'దోషం' కనుపించలేదు. అతడి మొదటి భార్య చనిపోయింది. ఆమెకో కూతురు వుంది. ఆమెకు వివాహమైన తర్వాత తను మళ్ళి పెళ్ళిచేసుకున్నాడు.

రాజారావు చనిపోయిన చెల్లెలికొడుకే కాంతారావు.

కాంతారావుకూడ తన మేనమామపోలికలలో నే వున్నాడు.

రాజారావుకీ చనిపోయిన మూర్తికీ ఏవైనా పరిచయం గాని వ్యాపార సంబంధాలు గాని ఉన్నాయేమో అని ఆరాతీశాడు నిరంజనరావు. కాని అలాంటివేం ఉన్నట్టు కనబడలేదు.

అయితే మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మూర్తి చనిపోయే ముందురోజున అతడు ఇండస్ట్రియల్ ఎస్టేట్ కి వెళ్ళి ఒకరోజు అక్కడ ఉన్నాడు.

10

నిరంజనరావు టేబుల్ మీది ఫోన్ మ్రోగింది. రిసీవరెత్తి "హలో" అన్నాడు.

"హలో సార్! సర్కిల్ ఇన్స్పెక్టరుగారేనా మాట్లాడుతూంట! ఇప్పుడే నాకో కొత్త సమాచారం తెలిసింది సార్! మూర్తి పేరిట ఆంధ్రాబ్యాంకులో నలభయ్ ఆరు వేల రూపాయలు ఎకౌంటు ఉన్నదట!" ఫోనులో చెప్పింది సరస్వతి.

"అలాగా? అతడికి మీరిచ్చారా ఆ డబ్బు?"

"లేదండీ! స్టుడియో ఖర్చులకు అని నెలకు వెయ్యి రూపాయలు నా దగ్గర తీసుకువెడుతుండేవాడు! మరి అంతడబ్బు అతనికి ఎలావచ్చిందో నాకూ ఆశ్చర్యంగా వుందిసార్! ఇందాక నే బ్యాంక్ ఏజంట్ గారు ఫోన్ చేసి చెప్పారు! ఆ డబ్బుకు నేనేగదా వారసురాల్ని!"

"సరేలెండి! మీ సమాచారానికి థ్యాంక్స్!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

మళ్ళీ ఏదో ఆలోచన వచ్చింది. రిసీవరెత్తి ఆంధ్రా బ్యాంక్ కు ఫోన్ చేశాడు. ఏజంట్ గార్ని కాంటాక్ట్ చేసి మూర్తి ఎకౌంట్ లో ఆ డబ్బు ఎప్పుడెప్పుడు జమకట్టి

బడింది, డ్రాఫ్ట్ రూపంలో లేక చెక్కుల ద్వారా డిపాజిట్ చేశారో సమాచారం కావాలని అడిగాడు.

ఒక నిమిషం గడిచాక ఆ వివరాలూ వచ్చాయి. మూర్తి గత మూడు నెలల్లోనూ ఒక నెల పదిహేను వేలూ మరోదఫా ఇరవయ్ వేలూ, మూడో నెలలో పదకొండు వేలూ బ్యాంక్ లో జమకట్టాడు. అంతా క్యాష్ గానే ముట్టచెప్పబడింది.

ఇన్స్పెక్టర్ రాజేంద్ర, సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజన రావు దీర్ఘమైన ఆలోచనలో పడ్డారు. ఫోటోస్టుడియో ఎంత బాగా బిజినెస్ చేసినా వందల్లోనే గాని వేలల్లో వ్యాపారం చెయ్యటం అసంభవం. అయితే అతనికి అంత డబ్బు ఎలావచ్చింది. మూర్తికి లాటరీలు కట్టే అలవాటు గాని రేసులో పాల్గొనే పిచ్చిగాని లేదు.

అయితే అతడు బ్లాక్ మెయిలరా?

“అంతే అయివుండాలి సార్! అదేకాదు. అతడు లక్షాధికారుల్ని బ్లాక్ మెయిల్ చేస్తుండాలి.”

“కరెక్ట్! కార్తికనగర్ పోదాం! అక్కడ ధనవంతులు ఎందరున్నారో ఆరాతీస్తే ఈ మిస్టరీ కొంత విడిపోవచ్చు.”

నిరంజనరావు లేచాడు.

11

నిరంజనరావు లోపల కూర్చుని కాఫీ త్రాగుతున్నాడు జలజతో మాట్లాడుతూ.

ఇన్స్పెక్టర్ రాజేంద్ర ఊళ్లోకి వెళ్లాడు తనకు కావలసిన సమాచారం సేకరించటానికి.

సారథి ఇంట్లో లేడు. ఫ్యాక్టరీలో ఉన్నాడని చెప్పారు. అతడీమధ్య పెన్నుల ఫ్యాక్టరీలో బిజీగా ఉంటున్నాడు.

మూర్తి మొదటి భార్యను పిలిచి కొన్ని ప్రశ్నలడి

గారు. ఆమె చెప్పిన దాన్నిబట్టి మూర్తి సరస్వతిని కేవలం డబ్బుకోసమే పెళ్ళాడాడు. ఆ వివాహానికి ముందు మూర్తి పేర బ్యాంక్‌లో నయాపైసా లేదు సరికదా ఊరినిండా అప్పులున్నాయ్. ఈ వివాహంతో ఆ బాకీ లన్నిటినీ తీర్చి వేశాడు. ఆ తర్వాత అతను ఎక్కడా బాకీలు చేయకుండా సరస్వతి జాగ్రత్తపడింది.

కనుక ఈ డబ్బు, అంటే నలభై ఆరువేలు మూడు నెల్లలో అతడికెలా వచ్చింది?

ఇన్స్పెక్టర్ రాజేంద్ర తిరిగి వచ్చాడు. మూర్తి ఈ ఊళ్లో ఆక్రితం రోజున అంటే రేపు చనిపోతాడనంగా, నలుగురు వ్యక్తుల్ని కలుసుకున్నాడు.

మొదటివ్యక్తి పంచాయితీబోర్డు ప్రెసిడెంటు రామారావు భార్యను కలుసుకున్నాడు. ఆ తర్వాత కాంతారావుని కలిసి ఏవో మాట్లాడాడు. మధ్యాహ్నం సాగర్ పెన్ వర్క్స్‌లోకి వెళ్లాడు. నాలుగో వ్యక్తి సూర్యం.

అతడి చేతుల్లో ఫోటో ప్రింట్స్ వుంచే కవరువుంది, వీళ్ళందరితోనూ మాట్లాడేటప్పుడు.

"ఇన్స్పెక్టర్ రాజేంద్ర! జలజనుంచి మీరేదో సమాచారం కావాలన్నారుగా? మీరు ఆమెని ప్రశ్నిస్తూ ఉండండి! ఈ లోపల నేను బయటకు వెళ్ళివస్తాను' అంటూ జలజ చూడకుండా సైగచేసి బయటికి వెళ్ళిపోయాడు.

"చూడండి జలజగారూ! మా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మీకూ విసుగ్గానే ఉందనుకుంటాను! అయినా తప్పదు. హంతకుని ఆచూకీ దొరికేదాకా మీకూ మాకూ ఈ బాధ తప్పదు!" అన్నాడు ఇన్స్పెక్టర్ రాజేంద్ర, జలజను చూస్తూ.

"అంతేసార్! మీకేం సమాచారం కావాలి! అడగండి"

అంది జలజ, మళ్ళీ 'రెడ్డెచ్చె మొదలీడ!' అన్నట్టుగా కథ మళ్ళీ మొదటికి వచ్చింది అనుకుంది.

12

నిరంజనరావు, రాజారావు ఇంటికెళ్ళాడు సైకిల్ వేసుకుని. ఇల్లంతా బావురుమంటూ వుంది. అతనికి వాకిట్లోనే విచారంగావున్న నౌకరు ఎదురయ్యాడు.

"దండాలు బాబయ్యా! ఎవరికోసమండీ?" వినయంగా నమస్కరిస్తూ అడిగాడు నౌకరు.

"మీ అయ్యగారున్నారా?"

"లేరండీ!. ఆయన పట్నం వెళ్ళారు ఏదో పనిమీద!"

"పోనీ అమ్మగారున్నారా?"

"ఉన్నారండీ! ఇలా కూర్చోండి అయ్యా! వెళ్ళి పిల్చుకు వస్తాను!" అంటూ లోపల గదుల్లోకి వెళ్ళి పోయాడు.

నౌకరు వెళ్ళి సరళతో పోలీస్ ఆఫీసరు రాక గురించి చెప్పటం, ఆమె 'కాంతారావు ఇంట్లో లేకుండా ఎక్కడకు వెళ్ళాడని' విసుక్కోవడం నిరంజనరావు చెవినబడక పోలేదు.

ఆమె ముఖాన చిరునవ్వు అలుముకుని నిరంజనరావు ముందుకు వచ్చింది.

"నమస్కారమండీ!" అన్నది.

"నమస్కారం! మీవారున్నారా?" అనడిగాడు ఆమె అందానికి అచ్చెరువు పొందుతూ.

"లేరండీ! వారు మద్రాసు కెళ్ళారు ఏదో పనిమీద! ఎప్పుడు వచ్చేది తెలియదు!"

"అలాగా! సరే పోనివ్వండి. గత వారంరోజుల క్రితం మూర్తి ఇక్కడకు వచ్చినట్టు మీకేమైనా తెలుసునా?"

ఆమె ఆలోచనగా పైకి చూసింది. ఆ తర్వాత నింపాదిగా అన్నది. "మా వారికోసం ఎందరో వస్తుంటారు! ఆ విషయాలు నేను పట్టించుకోను!"

ఆమె పెదాలు వణుకుతున్నాయ్. కళ్ళలో నీరు జేరుతున్నది. మనిషి చికాకుగా ఉన్నట్టు కనిపించింది. ఈమె కోసం కాంతారావు ఏమైనా చెయ్యటానికి సిద్ధపడతాడన్నా ఆశ్చర్యంలేదు అనుకున్నాడు.

"సరేనండి! వారు ఊరినుంచి రాగానే వెంటనే నాకు కబురుచెయ్యండి! నేను ప్రస్తుతం సారథి వాళ్ళింట్లో మకాం చేస్తున్నాను."

"అలాగే!" అని సరళ నమస్కరించింది.

ప్రతి నమస్కారంచేసి నిరంజనరావు అక్కడ్నుంచి బయటకు వచ్చాడు.

సారథిని కలుసుకోవాలని పేనాల ఫ్యాక్టరీకి వెళ్ళాడు అటునుంచి.

వాకిట్లోనే సారథి ఎదురుపడి ఆహ్వానించాడు. డ్రింక్ తెప్పించి ఆఫర్ చేశాడు.

"ఏం సార్! మా కలాల వర్క్ షాప్ చూద్దామని వచ్చారా?" అని అతడికి వర్క్ షాప్ అంతా చూపించాడు.

మద్రాసులోని ఒక ప్రముఖవ్యాపారసంస్థ కొత్తరకం కలాలకు ఆర్డరిచ్చింది. ఆ కలం ఫ్యాషన్ కోసం వాడేది. దాన్ని చేతికర్రలాగా పట్టుకుపోవచ్చు. రూళ్ళకర్ర అంత లావున ఉంది. పది అంగుళాల పొడవుంది. చూసేవాళ్ళకు అది రూళ్ళకర్రగానే కనబడుతుంది. కాని పై క్యాప్ తీస్తేగాని అది కలం అని కనుక్కోలేరు.

ఆ కలాన్నొకదాన్ని తీసి నిరంజనరావుకు చూపించాడు సారథి. ఒక కొత్తకలాన్ని ప్రెజెంట్ చేశాడు. సర్కిల్

ఇన్స్పెక్టర్ నిరాకరించాడు. కాని సారథి బలవంతంమీద చివరకు తీసుకోక తప్పలేదు.

"అన్నట్టు సారథగారూ! మూర్తి మీ వర్క్‌షాప్‌కి వచ్చినట్టు మాకు తెలిసింది. ఎందుకు వచ్చాడో తెలుసుకోవచ్చా?"

"తప్పకుండాను! అతను సరస్వతిని వివాహం చేసుకున్న తర్వాత అతడికీ ఈ కలాల ఉత్పత్తిలో వాటాదారుడు కావాలనే కాంక్ష కలిగింది. అందుకే మా నివాసమయిన కార్మిక నగర్‌కి వచ్చినప్పుడల్లా నన్ను కలుసుకోకుండా వెళ్ళటంలేదు."

"ఓ, ఐసీ! అయితే మీరు అతడ్ని పార్ట్‌నర్‌గా చేసుకున్నారా?"

"లేదండీ! ఈ ఫ్యాక్టరీ నా స్వంతం. ఇందులో ఎవరికీ భాగం పెట్టదలచుకోలేదు! ఆ మాటే చెప్పాను అతడితో. కానీ ప్ర ప్రతిమాలాడు. చివరకు లాభంలేదని తెలిసి వెళ్ళిపోయాడు."

"థ్యాంక్యూ మిస్టర్ సారథీ!" అంటూ నిరంజనరావు బయటకు వచ్చేశాడు.

13

వర్క్‌షాప్‌లో కార్మికులకు ఏవో సూచనలు ఇచ్చి వచ్చి సారథి ఆఫీసురూమ్‌లో కూర్చుని ఏవో ఉత్పత్తి అంచనాలను సరిచూస్తున్నాడు.

అతడి గదికి ప్రక్కనే మరో గదిలో టైపిస్ట్ చందన టకటక కాగితాలు టైప్ చేస్తున్నది.

ఎవరో వ్యక్తి దురుసుగా సారథి గది తలుపు తోసుకుని వెళ్ళటం చూసింది ఆమె. అతను హరి అని గుర్తుకు తెచ్చుకోవటానికి అట్టేసేపు పట్టలేదు ఆమెకు. టైప్ చెయ్యటం

ఆపి లోపల్నుంచి వినబడే మాటలు విందామని చెవులు రిక్కించుకుని ఉంది.

హరి ఏవేవో చెపుతున్నాడు. అతడి ప్రతి మాటలకు సారథి ఒక్క ముక్కలో సమాధానం చెబుతున్నాడు. అంతలోనే డ్రాయరు లాగిన చప్పుడు, ఆ వెంటనే పిస్తోలు పేలిన శబ్దం వినవచ్చాయి. గుండెల కంగారుపడి పోయింది. టేబుల్ కి అమర్చిన బజ్జర్ నొక్కింది.

సారథి గది తలుపు నెట్టుకుని హరి బయటకు వచ్చి ఫ్యాక్టరీలోంచి గోడౌనుమీదకు పరుగెత్తాడు. అతడి చేతిలో రివాల్వర్ ఉంది.

గోడౌనుమీద తాళం వేయకుండా ఉన్న స్కూటర్ ని స్టార్ట్ చేసి చూస్తూండగానే కనుచూపుమేరలో లేకుండా మాయమయిపోయాడు.

గుండెల, సారథి గది తలుపులు బార్లా తెరిచింది. పిస్టల్ షాట్ విని ఫ్యాక్టరీలోని పనివాళ్ళు పరుగెత్తుకు వచ్చారు.

లోపలకు వెళ్ళి చూశారు అంతా. కుర్చీలో సారథి లేడు. ఆదుర్దాగా ఇంకా లోపలకు జొరబడ్డారు. టేబుల్ ప్రక్కనే నేలమీద తివాసిపై పడివున్నాడు సారథి. అతడి కుడి భుజంలోకి బుల్లెట్ దిగబడి రక్తంకారి చొక్కానంతా తడిపేసింది.

"నాకేం భయంలేదు! ముందు డాక్టరుకు కబురు పెట్టండి!" అని అరిచాడు సారథి.

డాక్టరుకోసం ఎవరో పరుగెత్తారు. మరొకరు గుడ్డ తడిపి రక్తం వచ్చేచోట అదిమి ఉంచారు.

"పోలీసులకుకూడా కబురు పెట్టండి! వాడు అసలే ఉద్రేకంలో ఉన్నాడు. చేతిలో పిస్తోలు ఉంది. ఇంకా అందులో నాలుగు బుల్లెట్లున్నయ్!" తనదగ్గరకు వచ్చిన వారితో

హీనస్వరంలో చెప్పాడు.

డాక్టరూ మరో కాంపౌండర్ వచ్చారు. సారథిని టేబుల్ మీద పడుకోబెట్టి అక్కడికక్కడే బుల్లెట్ ని తీసేసి భుజానికి బ్యాండేజీ కట్టారు.

ఇన్స్పెక్టర్ రాజేంద్ర, సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజన రావు కోపలకు చూసుకువచ్చారు, అరగంట తర్వాత.

రక్తం పోవటం వలన సారథి నీరసంగా ఉన్నాడు. అయినా నిదానంగా మాట్లాడగలుగుతున్నాడు. తనను హరి పిస్తోలుతో కాల్చినట్లు చెప్పాడు. అతడి చేతిలో పిస్తోలు ఉండకనే పారిపోయాడు. ఇంకా ఎందర్ని కాల్చి చంపుతాడో అన్న ఆవేదన వ్యక్తం చేశాడు.

రాజేంద్ర పోస్టాఫీసునుంచి ఆ గ్రామం చుట్టుప్రక్కల స్టేషన్లన్నిటికీ ఫోన్ చేసి హరి విషయం తెలియజేశాడు.

"హరి ఏదో బ్లాక్ మెయిల్ వ్యవహారంలో ఉన్నాడేమో అని అనుమానంగా ఉంది. ఈ మధ్య అతడిదగ్గర డబ్బు ఎక్కువగా కనబడుతోంది. అతడి 'కాంటాక్ట్స్' ఎవరో మీ కేమైనా అయిడియా ఉందా?" అడిగాడు నిరంజనరావు, సారథని.

"నాకు అంతగా అయిడియా లేదండి. కాని నా అనుమానం ఇక్కడే ప్లాస్టిక్ కంపెనీలో ఫోర్ మెన్ గా పని చేస్తున్నతని భార్య, ఆమె పేరు కమల అనుకుంటాను! ఆమె ఇతడూ తరచూ సిటీకి వెళ్ళి వస్తుంటారు!"

"కమల! అంటే మూర్తి చనిపోయిన తర్వాత అతని ఆత్మకథని రచించే ఉద్దేశ్యంతో స్టుడియోలో ఇంటర్వ్యూకి వెళ్ళిన వ్యక్తే అనుకుంటాను!" నిరంజనరావు అడిగాడు.

"ఆ విషయం నాకు తెలియదుసార్!"

"సరే పోనివ్వండి! తర్వాత చెప్పండి!"

"వీళ్ళిద్దరి స్నేహం చూస్తుంటే వాళ్ళుగూడ మూర్తి

అనుచరులేమో అన్న అనుమానం కలుగుతోంది. అంతే కాని నా అనుమానానికి ఎటువంటి సాక్ష్యాలు లేవుసార్! ఇకపోతే మీరు హరికోసం వెదికించాలి, అతడి చేతిలోని పిస్తోల్లో బుల్లెట్లు అయిపోకముందే!''

నిరంజనరావు అక్కడినుండి హరి ఇంటికి వెళ్లాడు.

హరి భార్య సుందరి గోలుగోలున ఏడుస్తున్నది.

''ఆయన ఇలాంటి అఘాయిత్యం ఏదో చేస్తాడనే అనుమానిస్తున్నాను. పాడు డబ్బుకోసం ఏం కక్కుర్తి పనులు చేస్తున్నాడో ఏమో!'' అంది అతన్ని చూస్తూ.

''చూడమ్మా! నీ భర్తకు వచ్చిన భయం ఏమీలేదు. అతడీ మధ్య కానిపనులేమన్నా చేస్తున్నాడా?''

''ఆ వివరాలు నాకు తెలియవండి! పారిపోతున్న వ్యక్తిని పోలీసులు తుపాకులతో కాల్చి చంపుతారటగదా! నా భర్తకు ఏ ప్రమాదం రాకుండా చూడండి!'' అంటూ గోలుగోలున ఏడ్చింది.

హరి ఎటుగా పారిపోవటానికి వీలుంటుందో ఆ మార్గాలన్నీ వెదికారు పోలీసులు. హరి ఆచూకీ దొరకలేదు. కాని అతడు వేసుకువెళ్ళిన స్కూటరు మాత్రం రోడ్డుపక్కనే దొరికింది. ఆ ప్రాంతంలో ఎక్కువ సంచారం ఉండదు. అంతా మిట్ట పల్లాలు, దూరదూరంగా చెల్లాచెదురుగా ఉన్న ఇళ్ళు. వీటిమధ్య హరి దాక్కోవటానికి ఒకటికి వెయ్యి అవకాశాలున్నాయ్.

ఆ సాయంత్రమే పనిమీద నిరంజనరావు వెళ్ళిపోయాడు.

14

జలజ లైబ్రరీ హాల్ కేసి నడిచింది. తాళం తీసుకుని లోపల ప్రవేశించింది.

ఏదో వాసన ఇల్లంతా వ్యాపించి ఉంది. ఏమిటదీ అను కుంది? అది పెట్రోలు వాసన. పైనున్న పెట్రోలు డ్రమ్ము పగిలి అంగుళాందంతా క్రిందకు కారుతుందేమో, నేలంతా రొచ్చుగా ఉంది పెట్రోలుతో తడిసి.

ఆమె లైటు వేయటానికి స్విచ్ వేసింది. కాని వెలగ లేదు లైటు. బహుశా కరెంటు పోయి ఉంటుంది అను కుంది.

అవతల గది కిటికీ తలుపు గాలికి అల్లల్లాడుతూ చప్పుడు చేస్తోంది. ఏదో అడుగుల అలికిడి వినపడినట్లయ్యింది. ఆమెకు తను ఊరికే అనవసరంగా భయపడుతున్నానా అనిపించింది. అయినా ధైర్యం తెచ్చుకుని "ఎవరక్కడ?" అని అరిచింది. సమాధానం రాలేదు.

అంతలో ఆమె కళ్ళముందు ఏదో వెలుగు వచ్చినట్టయింది. అప్పుడే ఉదయించే సూర్యుని కిరణాలలా ఉంది ఆ వెలుగు.

అప్పుడామెకు అర్థం అయింది, అవి మంటలని! కావా లనే ఈ ఇంట్లో పెట్రోలు చల్లారు అంతటా. ఆ తర్వాత కిటికీలోంచి ఎవరో అగ్గిపుల్ల గీసి లోపలకు విసిరారు. కిటికీ తలుపుని బయటనుంచే లాగి మూసేశారు.

మంటలు ఇల్లంతా వ్యాపిస్తున్నయ్. డోర్ కర్టెన్లూ, తివాసీలూ, సోఫాలూ, కుర్చీలు అన్నిటిని స్వాహా చేసే స్తున్నయ్ మంటలు. చూస్తూండగానే మంటలు ఆమె చుట్టూ అల్లుకున్నయ్. బయట కుండపోతగా వర్షం. లోపల పెట్రోలుతో రాజుకున్న మంటలు, ఇంటిని స్వాహా చేస్తు న్నయ్. తననుగూడ చంపటానికి ఇది హంతకులు పన్నిన పన్నాగమని జలజకు అర్థమైపోయింది.

మంటలు దగ్గరకు వస్తున్నయ్. జలజ భయంతో పెద్దగా అరవసాగింది. పక్కవాళ్ళు, తలుపులన్నీ మూసేసి ఉండటంవల్లా

ఆమె కేకలు ఆమెకే భయంకరంగా వినవచ్చినయ్.

అంతలోనే ఆమెకు మరో ఆలోచన వచ్చింది. ఇందాక అగ్నిపుల్ల విసిరిన కిటికీకి ఊచలు లేవు. మంటలు తనను ఆక్రమించుకోకముందే ఆమె అటు పరుగెత్తింది. కిటికీ తలుపుని లాగి చూసింది. రాలేదు. దబదబమని దాన్ని బాదసాగింది. రెండు చేతులతోనూ పిడికిళ్ళు బిగించుకుని తలుపుమీద బాదుతోంది.

కిటికీ వారగా ఉన్న పుస్తకాల బీరువా కొయ్యతో చేసినది. అది కూడా అంటుకుంది. మరో క్షణంలో తనూ తగలబడిపోతుంది, అనుకుంది.

భళ్ళున కిటికీ తలుపులు తెరుచుకున్నయ్. బయట వానలో తడుస్తూ సారథి నిలబడి ఉన్నాడు. అతడు చేతులు చాచి జలజను పట్టుకున్నాడు. ఒక్క ఊపులో ఆమెను కిటికీలోంచి బయటకు లాగేశాడు.

15

పోలీసులూ, డాక్టరూ ఒక్కసారే వచ్చారు. ఇన్స్పెక్టర్ రాజేంద్రకు జరిగినదాన్ని వివరించి చెప్తున్నాడు సారథి.

"నేను కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాను. ఏదో కాలుతున్న వాసన వచ్చింది. అయినా నేను పట్టించుకోలేదు. ఇంత జోరున వర్షం పడుతుంటే ఏం తగులబడుతుందిలే అని సరిపెట్టుకున్నాను.

"ఇంతలో లైబ్రరీ హాల్లో కిటికీ తలుపు నెవరో లోపల్నుంచి బాదుతున్నట్టుగా అనిపించింది. స్నేహలతను కేకేశాను. ఆమె అప్పుడే బయటకు వెళ్ళివచ్చింది. ఆమె తలంతా తడిసిపోయింది గాబోలు తల తుడుచుకుంటూ నా మాటలు వినిపించుకోలేదు.

"ఆలస్యం చేస్తే పరిస్థితి విషమించవచ్చని నేనే లేచి వెళ్ళాను. ఏ కిటికీదగ్గర చప్పుడవుతున్నదో ఆ కిటికీ వద్దకు వెళ్ళి తలుపుల్ని బలంగా లాగాను. లోపల జలజ కనుపించింది. ఆమె చుట్టూ మంటలు అంటుకుంటున్నయ్. నేను రావటం ఏమాత్రం ఆలస్యంచేసినా ఆమె మనకు దక్కేది కాదు."

ఈ హడావిడిలో సారథి భుజానికున్న బ్యాండేజీ ఊడిపోయింది. మానిపోతున్న గాయంలోంచి మళ్ళీ రక్తం వచ్చింది.

డాక్టర్ అతడికి మళ్ళీ కట్టుకట్టాడు. ఇంజెక్షన్ ఇచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు. తర్వాత జలజని పరీక్షించాడు. ఆమెకు ప్రమాదం ఏమీ జరగలేదు. కాకపోతే భయంతో పడిపోయింది. ఆమెకు ఇంజెక్షన్ ఇచ్చిన అయిదు నిముషాలకు ఆమెకు తెలివివచ్చి కళ్ళు తెరిచింది. ఎదురుగా కాంతారావు కనుపించాడు. ఆమె అయిష్టంగా కళ్ళు మూసుకుని తల త్రిప్పుకుంది అతన్ని చూడటం ఇష్టం లేనట్టుగా.

పోలీసులు లైబ్రరీ హాల్లోకి వెళ్ళి చూశారు. ముందు రెండు గదులూ పూర్తిగా కాలిపోయినయ్. గోడలూ, పైకప్పు మినహా మరేం మిగలలేదు. డోర్ కర్టెన్లూ, కిటికీ కర్టెన్లూ, కుర్చీలు, సోఫాలూ, అన్నీ తగలబడి పోయినయ్. పై కప్పులోంచి వెంటిలేషన్ కిటికీ ఉంది. ఆ పై కప్పుమీద పెట్రోల్ డబ్బా ఉంది. అది విరగబడిపోయి పెట్రోల్ అంతా క్రింద గదుల్లోకి పారింది. ఎవరో కావాలని అగ్గిపుల్ల గీచి లోపలకు పడేసినట్టుగా జలజ చెప్పింది.

"ఇదంతా వాడి పనే అయివుండాలి!" అన్నాడు రాజేంద్ర తల నిమురుకుంటూ.

"ఎవరు సార్?" సారథి అడిగాడు.

"ఇంకెవరు? హరిగాడే! రాత్రి వాడు ఇంటికి వచ్చాడట. వాన మూలంగా మా వాళ్ళు అతడికోసం గాలింపు మానేశారు. ఇదే అదనుగా అతడు తన ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో అన్నం తిన్నాడు. క్రితం రాత్రి తన భార్య తన జేబులోంచి కాజేసిన నలభయ్ రూపాయలు మళ్ళీ పోట్లాడి తీసుకున్నాడు. ఎలా వచ్చాడో అలా జారుకున్నాడు వానలోనే."

"అయితే హరి వచ్చాడా? ఇది వాడి పనే అయి ఉండచ్చు సార్?"

"సారథిగారూ! మీకూ హరికీ అసలు ఘర్షణ పడాల్సిన అవసరం ఎందుకు కలిగిందో చెప్తారా?"

సారథి ఒక నిముషం ఆలోచించాడు. "అదేమంత పెద్ద విషయం కాదు! వాడి జీతం పెంచమని లోగడే అడిగాడు. అసలు నిన్ను ఉద్యోగం లోనుంచి తీసేయకుండా కంటిన్యూ చేయటమే అదృష్టం అనుకో అన్నాను. ఎందుకంటే క్రితం నెలలో 'ప్రెసిషన్ పీస్' అనే సున్నితమైన మిషన్ని పాడుచేశాడు. దాని విలువ కొన్ని వందలు వుంటుంది. అసలు వాణ్ని అప్పుడే తీసేయ్యాల్సింది.

"వాడు నే చేసిన ఉపకారాన్ని మరిచిపోయి నామీద కక్షగట్టాడు సార్!" అంటూ చెప్పాడు సారథి నిదానంగా.

వాన వెలిసింది. ఆ పూటే సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజనరావు తిరిగి వచ్చాడు.

జలజపై మళ్ళీ అత్యాచారం జరిగిందనీ, సారథి ఆమెను రక్షించాడనీ తెలుసుకున్నాడు. పారిపోయిన హరికోసం పోలీసుల్ని నాలుగువేపులకూ తరిమాడు.

నిరంజనరావు తనొక్కడే ట్రెజరీ హాలులోకి వెళ్ళాడు. సారథి తనుగూడ వస్తానన్నాడు లోపలకు.

"మీరు కదలకండి. మీ గాయం మళ్ళీ పెద్దదవుతుంది!" అని అతన్ని వారించాడు.

ముందు గది అంతా మసిబారి నల్లగా ఉంది. పెట్రోలు వాసన వస్తూనే ఉంది. ముందు రెండు గదుల్లోని వస్తువులన్నిటినీ అగ్ని తన పొట్టను పెట్టుకుంది. ఆ విషయం స్పష్టంగా తేటతెల్లమవుతున్నా గాని అతడు విసుగుజెందకుండా గోడ మూలలన్నీ వెదికి చూశాడు.

ఒక ప్రక్క గోడకు వెంటిలేటర్ మీద చిన్న ప్లాస్టిక్ బొమ్మ మంటలకు ఆహుతి కాకుండా మిగిలిపోయింది.

దాన్ని చేతబుచ్చుకుని బయటకు నడిచాడు నిరంజనరావు.

"చూడండి జలజగారూ! మీతోపాటు ఆ మంటల్లోనుంచి బయటపడింది ఈ బొమ్మ! దీన్ని జ్ఞాపకార్థంగా మీ దగ్గరే ఉంచుకోండి!" అంటూ బొమ్మ జలజ చేతికిచ్చాడు.

ఆ బొమ్మను చూస్తూనే సారథి మొహం అదోలా అయిపోయింది.

చిరునవ్వుతో ఆ బొమ్మను అందుకుంటూ అంది జలజ. "సార్ మద్రాసు వెళ్ళాలి, పర్మిషన్ ఇప్పించండి నాకు!"

"ష్యూర్! ష్యూర్! తప్పకుండా! నేనే మిమ్మల్ని మద్రాసు తీసుకువెళ్ళి దిగబెడతాను సరే?"

నిరంజనరావు బయటకు వెళ్ళాడు. మరో అరగంట తర్వాత తిరిగి వచ్చాడు.

"సారథి లేరా ఇంట్లో?" అని అడిగాడు.

"లేరండీ! ఫ్లైట్ కెక్కి వెళ్ళారు. నేను వెళ్ళొద్దని మొత్తుకున్నా వినలేదు!" అని స్నేహలత విచారంగా అంది.

"జలజగారూ! మనం మరో అరగంటలో ప్రయాణం కావాలి!" అన్నాడు నిరంజనరావు.

"ఇదిగో! పది నిముషాల్లో రానూ!" అంటూ జలజ బాత్ రూమ్‌లోకి పరుగెత్తింది.

ఇక్కడనుంచి ఎంత త్వరగా బయట పడగాలమా అని ఆమె ఆత్రంగా వుంది.

జలజ టాయిలెట్ అయివచ్చేసరికి పోలీస్ జీప్ వచ్చి ఆగింది ఇంటిముందర.

"స్నేహలతా! వెళ్ళొస్తాను! సారధిగారు ఇంట్లోలేరు సమయానికి. వెళ్ళానని చెప్పండి వారికి!" అంది జలజ జీప్‌లో ఎక్కబోతూ.

నిరంజనరావు జీప్ దగ్గరకు వచ్చాడు. జలజ జీప్ ముందుసీట్లో కూర్చుంది. నిరంజనరావు డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

జీప్ కదిలింది. చూస్తుండగానే కార్తికనగర్‌లో ఇళ్ళు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ అన్నీ దూరమయినయ్.

"మీ బొమ్మనిగూడ తెచ్చుకుంటున్నారా మీ వెంట?" అని అడిగాడు నిరంజనరావు.

జలజ నాలుక కొరుక్కుంది. "అరె! దాన్ని అక్కడే మర్చిపోయాను సుమండీ!" అంది.

"పోన్లెండి! దాన్ని గురించి విచారించకండి!"

16

మధ్యాహ్నం పోస్ట్‌మెన్ తలుపు తట్టాడు. వెళ్ళి తలుపు తీసింది జలజ. నాలుగు ఉత్తరాలు, ఒక పత్రిక ముప్ఫై రూపాయలకు మనిఆర్డరు ఇచ్చాడు.

తను వ్రాసిన వ్యాసం పత్రికలో పడింది. దాని కాపీ వచ్చింది ఇప్పుడు. రెండు నెలల క్రితం ప్రచురింపబడిన వ్యాసం తాలూకు పారితోషికం మనిఆర్డరు వచ్చింది. పోస్ట్‌మెన్ వెళ్ళిపోయాక తలుపు దగ్గరకువేసి వచ్చి

కుర్చీలో కూర్చుని ఉత్తరాలు చదవటంలో నిమగ్నమై పోయింది. వాటిని చదవటం పూర్తిచేశాక పత్రికలో ప్రచురింపబడిన వ్యాసం చదువుతూ కూర్చుంది.

వ్యాసం ధ్యానంలో పడిన జలజ, నెమ్మదిగా తలుపు తెరుచుకుని ఒకవ్యక్తి లోపలకు రావటం గమనించలేదు.

అతడు నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చాడు ఆమె దగ్గరకు. ఆ తర్వాత తన జేబులోంచి ఒక బొమ్మను తీసి ఆమె ముందరున్న టేబుల్ మీద పెట్టాడు.

జలజ భయంతో బిగ్గరగా అరవబోయి వచ్చినవ్యక్తిని చూసి ఆగిపోయింది.

ఆ వచ్చిన వ్యక్తి ఎవరో కాదు. సారధి! తను మరచి పోయి వచ్చిన ప్లాస్టిక్ బొమ్మను— తనతో బాటుగా మంటల్లో తగులబడిపోకుండా మిగిలిపోయిన బొమ్మను తెచ్చాడు.

“చాలా థ్యాంక్స్ సారధ గారూ! నేను హడావిడిలో ఆ బొమ్మను మరచిపోయాను తేవటం. నేను ఆ మంట ల్లోంచి బ్రతికి బయటపడ్డందుకు ఇది జ్ఞాపకార్థం!” అన్నది నవ్వుతూ.

సారధి ముఖంలోకి చూసిన జలజ నవ్వు మాయమయింది. అతడి కళ్ళు కోపంతో ఎర్రగా ఉన్నయ్. పెదిమలు వణుకుతున్నయ్. మనిషిని పట్టగానే నమిలి మింగే కిరాతకునిలా ఉన్నయ్ అతని ముఖకవళికలు.

“సారధీ! ఏమిటిది? మీరేదోరకంగా ఉన్నారు?” భయంతో అడిగింది జలజ.

“ఈ బొమ్మలో దాచినది ఏది? ఎక్కడ పెట్టావ్?”— అతడి గొంతు కర్కశంగా ఉంది.

జలజ బిత్తరపోయింది. భయంతో బిగుసుకుపోయింది.

"ఏమిటి మీరనేది? అందులో ఏముంటుంది? అది కేవలం బొమ్మ!" కంగారులో మాట సరిగారాక తడబడుతూ పలికింది.

సారథి రెండడుగులు ముందుకువేశాడు. అతడి కబంధ హస్తాలు ఆమె భుజాల్ని పట్టుకుని కుదిపించినయ్.

"సారథీ! వదలు! ఏమిటిది?" అతడి ముఖంలోకి చూస్తూ అరిచింది.

"ఏమీ తెలియని నంగనాచిలా నటించకు. ఈ బొమ్మలో డైరీని దాచాను. నీవు ఏంచేశావ్ దాన్ని! త్వరగా చెప్పు!"

"సారథీ! నీవేదో అపోహలో ఉన్నావ్! నన్ను వదిలెయ్. డైరీ గురించి నాకేం తెలియదు."

అతడు తన చేతుల్ని వదిలేశాడు. కాని మరుక్షణంలో ఆమె చెంపమీద బలంగా దెబ్బపడింది. ఆమె తూలి పడిపోయింది. పైట జారిపోయింది.

సారథి ఆమెమీదకు వంగాడు. జాకెట్ మధ్య భాగాన్ని గట్టిగా పట్టుకుని ఆమెను లేవదీశాడు. అయితే ఆమె బరువుకు జాకెట్ చిరిగిపోయింది. కొట్టకుండానే ఆమె క్రిందపడిపోయింది.

తల దేనికో కొట్టుకుంది. చిల్లిపడి నెత్తురు కారింది. అరచేత్తో గాయాన్ని అదుముకుంది జలజ.

సారథి ఆమెను లేవతీసి నిల్చోబెట్టాడు. గోడకానుకుని ఒరిగి నిలబడింది జలజ. పెద్దగా అరవాలనుకుంది. కాని అలా అరిచే లోపలే అతడి ఉక్కుచెయ్యి తన కంఠాన్ని నులిమేస్తూంది.

"నీవు ఆ డైరీని ఇచ్చావా సరేసరి! లేదూ! ఆ మూర్తిగాడు పై అంతస్తులోని కిటికీలోంచి పడిపోయినట్టుగా నీవూ పడిపోతావ్."

"అంటే? మూర్తిని హత్యచేసింది నీవేనా?" అంత హింసలోనూ ఆశ్చర్యంగా అంది జలజ అతడికేసి చూస్తూ.

"అవును! ఆ గాడ్గిని నేనే చంపాను. లేకపోతే నన్నే బ్లాక్ మెయిల్ చెయ్యాలని చూస్తాడా? నీ అనవసరపు ప్రసంగం కట్టిపెట్టి ఆ డైరీ ఎక్కడుందో త్వరగా ఇచ్చెయ్యి."

"మీరు అడిగేది ఈ డైరీకోసం కాదుగదా?" ఎవరిదో మూడో కంఠం వినిపించింది.

జలజ, సారధి ఇద్దరూ వాకిలికేసి చూశారు. గుమ్మంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజనరావు నిలబడి ఉన్నాడు. అతడి చేతిలో డైరీ వుంది.

బిలబిలమంటూ లోపలకు జొరబడ్డారు పోలీసులు, నిరంజనరావుని తప్పుకుంటూ. అందరూ సారధిని చుట్టుముట్టారు.

"మీరనేదేమిటో నా కర్థంకావటంలేదు సి. ఐ. గారూ?" అమాయకంగా అన్నాడు సారధి.

"ఏమిటా? మూర్తిని హత్యచేయటం, ఆ తర్వాత రాగిణిని చంపటం, సూర్యాన్ని చంపి అతడి శవాన్ని కాలువలో పారేయడం, జలజపై హత్యాప్రయత్నం! ఇప్పుడు అర్థమయిందా? మిస్టర్ సారధీ! నీఆట కట్టింది. నీ పెన్నుల ఫ్యాక్టరీగూడ మా స్వాధీనం అయింది!"

జలజ గుండెప్పగించి అలానే చూస్తూ ఉండిపోయింది. ఆమె కళ్ళముందు వెయ్యిదీపాలకాంతి వెలిగింది. అంతలోనే గాఢాంధకారం అలుముకుంది. నిల్చున్నపళంగా కుప్పలా కూలిపోయింది.

* * *

జలజ కళ్ళు తెరిచింది. చుట్టూ వాతావరణాన్ని కలియజూసింది. తను ఆస్పత్రిలో ఉన్నట్టు తెలుసుకుంది. తల

క్రింద దిండ్లు ఎత్తుగా పెట్టబడివున్నయ్. ప్రక్కనే నిల బడి తనను కనిపెట్టుకుని ఉన్న నర్సు గది బయటకు వెళ్ళి నిరంజనరావుని వెంటపెట్టుకుని వచ్చింది.

"ఇప్పుడెలా వుందమ్మా?" అనునయంగా అడిగాడు నిరంజనరావు.

"బాగానే ఉందండి! ఇంతకీ నాకేమయింది?" అని అడిగింది.

"అతిగా భయపడటంవల్ల నీకు స్పృహతప్పి పడి పోయావు. అంతే! అంతకన్నా పెద్ద ప్రమాదమేం జరగ లేదు."

"సారథి ఇంతపని చేస్తాడని కలలోకూడ అనుకోలేదు సుమండీ! అతడు హంతకుడంటే ఇప్పటికీ నమ్మశక్యం కాకుండా వుంది."

"నీకేకాదు! మాకూ అతడిమీద అనుమానం రాలేదు డైరీ దొరికేదాకా!"

"ఇంతకీ అతడు హంతకుడుగా మారాల్సిన అవసరం ఏమొచ్చింది సార్?"

"అదంతా పెద్దకథ అవుతుంది!"

జలజ ఉత్సాహంగా పైకి జరిగింది. "ఇప్పుడు నాకు ఓపికగానే ఉంది. వివరంగా కాకపోయినా టూకీగా అన్నా చెప్పండి ఇన్స్పెక్టర్!"

"చెబుతానమ్మా! చెబుతాను! నీకు కాకపోతే ఇంకెవ రికి చెప్పను? భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ ఇటీవల రెండుగా చీలిపోయిన సంగతి నీకూ తెలుసనుకుంటాను. ఒకవర్గం రష్యా అభిమానులు, మరోవర్గం చైనా అభి మానులు.

"అయితే చైనా అభిమానులు ప్రభుత్వ నిషేధాజ్ఞల్ని దృష్టిలోవుంచుకొని రహస్యంగా పనులుతుంటారు. ఈ

సారథిగూడ అలాంటి పెద్దమనిషే. అతడికి పెద్ద పెద్ద నాయకులతో పరిచయం వుంది. సైన్యవర్గంలో ఇతడు అత్యున్నత స్థానంలో ఉన్నాడు. అయితే ఈ విషయం ఆ పార్టీలోని మెంబర్లకుగూడ చాలమందికి తెలియదు.

"అతడి రహస్యం ఒకటి మూర్తికి తెలిసింది. అతడూ లోగడ కొన్నాళ్ళు ఆ పార్టీలో పనిచేసినవాడే. కాని అతడు డబ్బు మనిషి. పార్టీలోంచి విడివడిపోయి, సరస్వతిని పెళ్లాడిన తర్వాత అతడు పెట్టుబడిదారీవర్గంలో జేరిపోయాడు.

"సారథి రహస్యం ఆధారంగా అతన్ని బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజసాగాడు. ఈ విషయం పార్టీలో చర్చకు వచ్చింది. మూర్తికి టిక్కెట్టు ఇవ్వాల్సిందేనని నిర్ణయించారు పార్టీ ఉన్నతాధికారవర్గం. ఎందుకంటే అతడు పార్టీలో కొన్నాళ్ళు పనిచేసి ఉన్నందున, పార్టీ రహస్యాలు కొన్ని అతడికి తెలిసివుండవచ్చు. అది పార్టీకి ప్రమాదం ఎప్పటికైనా. రెండవది ఒక బ్లాక్ మెయిలర్ పీడా వదిలించుకోవటానికి.

"ఈ పని ఎవరు చేయాలీ అనే ప్రశ్నగూడ చర్చించారు. చివరకు ఆపని సారథికి అప్పగించారు. ఎందుకంటే అతని పార్టీ భక్తిని పరీక్షించటానికి ఒకటీ, రెండోది తనను డబ్బుకోసం పీడించే జలగలాంటి వ్యక్తిని ఏరిపారేసే అవకాశం అతనికే ఇవ్వాలనే దానికీ.

"సారథి అతిచాకచక్యంగా ఆ పని నెరవేర్చాడు. అతడు తనకు అప్పజెప్పబడిన పనిని చేస్తాడా, లేదా అని కనిపెట్టటానికి సూర్యాన్ని నియమించారు. సూర్యం పార్టీలో మామూలు వర్కరు.

"సారథి హత్యచేయటం చూసిన సూర్యం అతగాడు ఆపని ఎందుకు చేస్తున్నాడో ఆరాతీశాడు. అతడూ

అప్పుల్లో ఉన్నాడు. మూర్తి సారథినుంచి ఎలా డబ్బు రాబట్టేవాడో కనుక్కోవటానికి బయలుదేరాడు.

"సరస్వతితో ఇంటర్వ్యూకి వచ్చినప్పుడు డ్రాయర్లు శోధించి డైరీని దొరకబుచ్చుకున్నాడు. దాంతో సారథిని బెదిరించాలని చూశాడు. సారథి అతణ్ణి నేర్పుగా తన లైబ్రరీ హాలుకి పిలిపించాడు. సూర్యంను చంపి డైరీని తీసుకొని ప్లాస్టిక్ బొమ్మలో దాచేశాడు సారథి.

నీకు మత్తుమందు ఇచ్చి నిద్రపుచ్చాడు. నీవు మగతలో ఉన్నప్పుడే సూర్యంను చంపి శవాన్ని బయటకు చేర్చాడు.

"మూర్తిని కటికీలోంచి తొంగిచూస్తూ ఎదురు బిల్డింగులో ఒక స్త్రీని లీలగా చూశాడట సారథి. ఆమె రాగిణే అయివుంటుందని ఆమెను లారీ ప్రమాదానికి గురిచేశాడట అతడే!"

"అయితే సారథి నన్ను ఎందుకు చంపలేదు! నేను మంటల్లో ఉంటే నన్ను చావనీయక ఎందుకు రక్షించాడు!"

"నిన్ను రక్షిస్తే అతడే హంతకుడని ఎవరికీ అనుమానం రాదని ఆ విధంగా నటించాడు.

"తగులబడిపోయిన ఇంట్లోకి వెళ్ళినప్పుడు అదృష్టవశాత్తూ ప్లాస్టిక్ బొమ్మలో నాకా డైరీ కనిపించింది. లేకపోతే ఇన్ని హత్యలు చేసిన సారథి తప్పించుకొనేవాడు. డైరీగురించి సారథి నీ దగ్గరకు వస్తాడని మేము అతనికోసం వలపన్నాము. మేమాశించినట్లే అతను నేరుగా వచ్చి మా వలలో చిక్కిపోయాడు."

"ఇంతకీ సారథిని ఏవిషయం మీద బ్లాక్ మెయిల్ చేశాడు మూర్తి?"

"చైనావారు మొదటినుంచీ కత్తిబలంకన్న కలంబలం

గొప్పదని వాదించేవారు. ఆ మాటల్లోని అంతరార్థం ఇప్పుడు బయటపడింది. సాయుధ పోరాటంతో ప్రతి దేశంలోనూ విప్లవాన్ని లేవదీయాలని వాళ్ళ ఆశ.

"అందుకోసమే ఈ మధ్య కొత్తరకం పెన్నుల్ని కనిపెట్టారు. మామూలు పెన్ ఉంటుందిగదా! అందులోనే క్రిందభాగంలో పిస్తోలుని అమర్చేవిధంగా కొత్తరకం కలాన్ని ఉత్పత్తిచేశారు. పైన క్యాప్ తీస్తే రాసుకోవటానికి వీలుగా కలం ఉంటుంది. వాటిని తమ పార్టీ వారికి పంచిపెడుతున్నారు.

"క్రిందిభాగాన రహస్యంగా ట్రిగ్గర్ అమర్చబడి ఉంటుంది. దాన్ని ఊపదీస్తే పదిగజాల దూరంలో ఉన్న వ్యక్తిని కాల్చటానికి ఆట్టే శ్రమపడక్కర్లేదు. సరిగ్గా అలాంటి కలాలనుగూడ తయారుచేస్తున్నాడు సార్ధ రహస్యంగా. డైరీ ఆధారంగా అతడి ఫ్యాక్టరీని సోదా చేశాం. నేరస్థుడు దొరికిపోయాడు."

"అయితే హరి పాపి ఎలా అయ్యాడు?"

"వాడొట్టి ఉద్రేకపరుడేగాని బుర్రలేనివాడు. వాడ్ని రెచ్చగొట్టి మన అనుమానాన్ని అతడి మీదకు మళ్ళించాడు కేసుని తప్పుదోవ పట్టించటానికి!"

"తీగ లాగితే డొంక అంతా కదిలినట్టయ్యింది!" అంటూ చిన్నగా నిట్టూర్పు విడిచింది జలజ.

—: ఐపోయింది :—